

నవ్యాంధ్ర జాతిపిత చంద్రబాబు నాయుడు గారు, అమరావతి సృష్టికర్త పోలవరంతో తెలుగు నేల సస్యశ్యామలం చేస్తున్న అద్భుత నాయకుడు. ఆయన క్రమశిక్షణ, అంకితభావం, దృష్టి ద్వారా రాష్ట్ర అభివృద్ధి వైపు దూసుకెళ్తుంది. ముఖ్యమంత్రి గారికి 76వ జన్మదిన శుభాకాంక్షలు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ




సోమవారం 20.04.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 | సంచిక - 363 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00

## చిన్నారుల ప్రాణాలకు అండగా 'ప్రాజెక్ట్ పునర్విక'

### మంత్రి నారా లోకేష్ సంచలన నిర్ణయం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అరుదైన జన్యు వ్యాధులతో బాధపడుతున్న వేలాది చిన్నారులకు ఆశాకిరణంగా నిలిచేలా మంత్రి నారా లోకేష్ 'ప్రాజెక్ట్ పునర్విక'కు శ్రీకారం చుట్టారు. రూ. 16 కోట్ల విలువైన అరుదైన ఇంజెక్షన్‌ను సమకూర్చి చిన్నారి పునర్విక ప్రాణాలను కాపాడిన నేపథ్యంలో, ఇకపై మరెవరికీ ఇలాంటి పరిస్థితులు రాకూడదనే సంకల్పంతో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు.

ఆదివారం ఎక్స్ వేదికగా మంత్రి లోకేష్ ఈ విషయాన్ని వెల్లడించారు. పునర్విక ఘటనను కేవలం ఒక చిన్నారి కథగా కాకుండా, సామాజిక ఉద్యమంగా తీర్చిదిద్దాలని నిర్ణయించినట్లు తెలిపారు. అరుదైన వ్యాధులతో పోరాడుతున్న చిన్నారులకు ఖరీదైన చికిత్సలను అందుబాటులోకి తీసుకురావడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

**పునర్విక పోరాటం స్ఫూర్తిగా... :** 11 నెలల చిన్నారి పునర్విక అరుదైన వ్యాధితో ప్రాణాపాయ స్థితిలో ఉండగా, ఆమెకు అవసరమైన రూ. 16 కోట్ల ఇంజెక్షన్ కోసం రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా స్పందన వ్యక్తమైంది. ప్రజలు తమ పిల్లలనే ఆమెలో చూసుకుని ప్రార్థనలు, విరాళాలతో ముందుకొచ్చారు. చివరకు అందరి సహకారంతో చిన్నారి ప్రాణాలు నిలిచాయి.

ఈ ఘటన మంత్రి లోకేష్‌ను తీవ్రంగా కదిలించింది. "చిన్న శరీరం... కానీ అద్భుతమైన పోరాటం" అంటూ ఆయన స్పందించారు. పునర్విక అదృష్టవంతురాలు అయినా, ఇలాంటి వేలాది చిన్నారుల భవిష్యత్తు ఏమిటి? అనే ప్రశ్న తనను ఆలోచింపజేసిందని తెలిపారు.

**ఖరీదైన చికిత్సలకు శాశ్వత పరిష్కారం :** దేశవ్యాప్తంగా అనేక మంది చిన్నారులు అరుదైన జన్యు వ్యాధులతో నిశ్శబ్దంగా పోరాడుతున్నారని, చికిత్సలు ఉన్నప్పటికీ వాటి ఖర్చులు లక్షల నుంచి కోట్ల రూపాయల వరకు ఉండటం వల్ల సామాన్య కుటుంబాలు వాటిని అందుకోలేకపోతున్నాయని మంత్రి లోకేష్ గుర్తించారు. ప్రతి కేసులో వ్యక్తిగతంగా సహాయం చేయడం సాధ్యం కాదని భావించి, మిగతా 2లో...

### మంత్రి సత్యకుమార్ కృషితో...

## రైతన్నల దశాబ్దాల కల సాకారం



- మంత్రి సత్యకుమార్ చొరవ, కృషితో వందలాది ఎకరాలకు అందనున్న సాగునీరు
- కొండలను తొలచి చింతకుంట చెరువుకు ఫీడర్ (లింక్) ఛానల్ నిర్మాణం
- అడ్డుగా ఉన్న కొండల తొలగింపుతో ప్రతి చుక్క నీరు రైతుకే
- మంత్రి సత్య కుమార్ యాదవ్

2 లో

**ముదిగుబ్బ(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కృషి హతో రైతన్నల దశాబ్దాల కల నెరవేరనుంది. ముదిగుబ్బ మండలం బూదనంపల్లి గ్రామంలోని బూదలమ్మ చెరువు నుండి చింతకుంట చెరువుకు ఆదివారం నిర్వహించిన వీబీజీ – రామ్‌జీ మరియు జలధార (తాగునీరు & భూగర్భ జలాల పెంపుదల) ఫీడర్ (లింక్) ఛానల్ నిర్మాణ పనుల కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ గారు పాల్గొన్నారు.

## ప్రజల ఇళ్లలో 'సూర్య' కాంతి



- ఎస్సీ, ఎస్టీలకు వందశాతం సబ్సిడీతో సోలార్ ప్యానెల్స్: మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి


**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజల జీవితాల్లో గొప్ప మార్పు తీసుకురాగలిగే పీఎం సూర్య ఘర్ పథకం ప్రారంభించటం చాలా ఆనందంగా ఉందని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా కోటి గృహాలకు ఉచిత విద్యుత్ అందించాలనే మహత్తర లక్ష్యంతో ఈ పథకం అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు వంద శాతం సబ్సిడీతో ఉచితంగా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. ఆదివారం బనగానపల్లె పంచమపేటలో ప్రధానమంత్రి సూర్యఘర్ ఉత్సవ్‌ను మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

మిగతా 2లో...

### పారదర్శకంగా ఉంటున్నాం...

## ప్రజలకు వాస్తవాలు తెలియచేద్దాం

- టీడీపీ ఇస్తోన్న శిక్షణా తరగతులతో లీడర్-కేడర్ మధ్య ఎమోషనల్ కనెక్టివిటీ
- పార్టీ ముఖ్యనేతల టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు
- ఈ నెల 29వ తేదీన పార్టీ కొత్త కార్యవర్గం బాధ్యతల స్వీకరణ




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజలకు సంక్షేమం, ప్రభుత్వ సేవలు, రాష్ట్రాభివృద్ధి విషయంలో పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని...కానీ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని.... వాస్తవాలను ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. అందుబాటులో ఉన్న ముఖ్య నేతలతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ మేరకు తాజా రాజకీయ పరిణామాలపై సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులున్నా... వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూనే... ప్రజలకు సంక్షేమం-అభివృద్ధి అందించే విషయంలో రాజీ పడకుండా పరిపాలన సాగిస్తున్నామని సీఎం అన్నారు. ఈ విషయాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కొందరు ప్రభుత్వం మీద.. కూటమి పార్టీల మీద అబద్దాలాడుతూ రాజకీయం చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇలాంటి తప్పుడు సమాచారాన్ని వివిధ మార్గాల ద్వారా.. వివిధ వ్యక్తుల ద్వారా చేరవేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాల్సిందేనని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజలకు వాస్తవాలు తెలిస్తే... వాళ్లే విశ్లేషించుకుంటారని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. పరిపాలన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పడుతున్న కష్టాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పగలిగితే... ప్రత్యర్థుల కుట్రలను తిప్పికొట్టేలా ప్రజలే ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారతారని చెప్పారు. మొన్నటి ఎన్నికల్లో నాటి ప్రభుత్వం ఎంతగా కూటమి పార్టీలను అణగదొక్కే ప్రయత్నం చేసినా... 2లో...

## శనగ రైతులకు ఊరట...



- మంత్రి అచ్చెన్నాయుడు చొరవతో కేంద్రం గ్రీన్ సిగ్నల్
- కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తో వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న మంత్రి అచ్చెన్న
- మిగిలిన శనగలను కూడా త్వరలో కొనుగోలు చేయిస్తాం, రైతులు ఆందోళన చెందొద్దు
- క్రాప్ డైవర్షన్ వల్ల మొక్కజొన్న సాగు, దిగుబడి పెరిగిందని కేంద్రానికి వివరించిన మంత్రి అచ్చెన్న
- ప్రత్యేక పరిస్థితుల్లో మొక్కజొన్న కొనుగోలు చేయాలని కేంద్రాన్ని కోరిన మంత్రి
- ఆహార శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తో మాట్లాడి, త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని మంత్రి చౌహాన్ హామీ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం దృఢసంకల్పంతో పనిచేస్తోందని, రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం కలగనీయబోమని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా మంత్రి అచ్చెన్నాయుడు చొరవ చూపి, మిగతా 2లో...

## మైనారిటీల సంక్షేమానికి గత ప్రభుత్వం తూట్లు



- రాజకీయ కక్షతో నిధుల నిలిపివేత
- సొంత జిల్లాలో హజ్ భవన్ ను పూర్తి చేయలేదని ధ్వజమెత్తిన మంత్రి ఫరూక్
- రెండవ విడతలో 177 మంది హజ్ యాత్రకు జెండా ఊపి వీడ్కోలు పలికిన మైనారిటీ మంత్రి ఫరూక్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రం లోని మైనారిటీల సంక్షేమానికి గత ప్రభుత్వం తూట్లు పొడిచిందని రాష్ట్ర మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ ధ్వజమెత్తారు. మిగతా 2లో...

## ఏపీలో అత్యవసర వైద్య సేవల్లో కొత్త శకం




- 10 నెలల్లో 6.4 లక్షల మంది ప్రాణాలను కాపాడిన 'భవ్య హెల్త్ కేర్' - 108 సర్వీస్
- 9,183 గుండెపోటు కేసుల్లో 'గోల్డెన్ అవర్'లో స్పందించి ప్రాణదానం
- అత్యాధునిక 190 కొత్త అంబులెన్స్‌లతో బలపడ్డ 108 ఫ్లీట్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యవసర వైద్య సేవలను ప్రతి కుటుంబానికి అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ప్రభుత్వ భాగస్వామిగా భవ్య హెల్త్ సర్వీస్ ఆధ్వర్యంలో నడుస్తున్న 108 అంబులెన్స్ సర్వీస్ గత 10 నెలల్లో అసాధారణ పనితీరు కనబరిచింది. మిగతా 2లో...

### ఏపీకి మరో రెండు రైల్వే లైన్లు..

## రూ.9,889 కోట్లకు కేంద్రం ఆమోదం

**న్యూఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌కు మరో రెండు కీలక రైల్వే లైన్లు రానున్నాయి. రాష్ట్రంలోని అత్యంత రద్దీగల హావ్‌డా-చెన్నై రైల్వే మార్గ విస్తరణకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. రాజమండ్రి సమీపంలోని నిడదవోలు నుంచి విశాఖపట్నం సమీపంలోని దువ్వాడ వరకు 3వ, 4వ రైల్వేలైన్ల నిర్మాణానికి రూ. 9,889 కోట్లతో కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ (సీసీఈఏ) సమావేశంలో ఈ ప్రాజెక్టుకు ఆమోదం లభించింది. మొత్తం 198 కిలోమీటర్ల పొడవుతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టును ఐదేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొత్తం ట్రాక్ పొడవు 458 కిలోమీటర్లుగా ఉండనుంది.

రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ, ప్రస్తుతం ఈ మార్గంలో రవాణా సామర్థ్యం 130 శాతానికి చేరడంతో తరచూ రద్దీ, జాప్యాలు ఎదురవుతున్నాయని తెలిపారు.



కొత్తగా 3, 4వ లైన్లు నిర్మించడం ద్వారా రైల్వే నిర్వహణ సామర్థ్యం మెరుగుపడి, సరకు రవాణా వేగవంతమవుతుందని చెప్పారు.

ఈ ప్రాజెక్టు ద్వారా విశాఖపట్నం, కాకినాడ, మచిలీపట్నం, గంగవరం పోర్టులకు మెరుగైన అనుసంధానం లభిస్తుంది. థర్మల్ పవర్, సిమెంట్, స్టీల్ ప్లాంట్లతో పాటు రసాయన ఎరువులు, ఆహార ధాన్యాలు, బాక్సైట్, జిప్సం, సున్నపురాయి రవాణాకు సౌలభ్యం పెరుగుతుంది. 2లో...

## మహిళల భవిష్యత్తును కాంగ్రెస్ కాలరాసింది

- బిల్లును అడ్డుకుని ఘోర పాపం చేసింది: కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస వర్మ
- విజయవాడలో మహిళా ఆక్రోశ సభ నిర్వహిస్తాం: పీవీఎన్ మాధవ్

**న్యూఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** మహిళల ఆశలు, ఆకాంక్షలను కాంగ్రెస్ పార్టీ చిదిమేసిందని కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస వర్మ తీవ్రస్థాయిలో విమర్శించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో కలిసి ఢిల్లీలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించిన వారు, మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం ద్వారా కాంగ్రెస్ ఘోరమైన పాపం చేసిందని మండిపడ్డారు.

కాంగ్రెస్ పార్టీని, దాని మిత్రపక్షాలను మహిళలు ఎప్పటికీ క్షమించరని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. మహిళల ఆగ్రహాన్ని కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు తప్పకుండా రుచి చూస్తాయని హెచ్చరించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకుని మహిళలకు తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు.

2029 నాటికి మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సమాజంలో తమ




సత్తా చాటాలని మహిళలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నారని, తమ హక్కుల కోసం దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నారని గుర్తు చేశారు. 2023లోనే 'నారీశక్తి వందన్ అధినియం' తీసుకొచ్చామని, అప్పట్లో అందరూ మద్దతు తెలిపారని చెప్పారు. మహిళా బిల్లుకు సాంకేతికంగా కొన్ని సవరణలు అవసరమై తిరిగి తీసుకొచ్చామని, దీనిపై రెండు రోజులపాటు అన్ని పార్టీల నేతలు చర్చించారని వివరించారు. డీలిమిటేషన్ వల్ల ఏ రాష్ట్రానికి, ఏ పార్టీకి, ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదని స్పష్టం చేశారు. డీలిమిటేషన్‌ను ఎందుకు అడ్డుకుంటున్నారో విపక్షాలు ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. మిగతా 2లో...

## పారదర్శకంగా ఉంటున్నాం... ప్రజలకు వాస్తవాలు తెలియచేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు వాస్తవాలు తెలుసు కాబట్టి అద్భుతమైన విజయాన్ని అందించారని గుర్తు చేశారు. ప్రజలకు వాస్తవాలను తెలియచేయడమనేది ప్రధాన బాధ్యత అనే విషయాన్ని గుర్తించాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఇక టీడీపీ నిర్వహిస్తోన్న ట్రైనింగ్ క్లాసులతో పాటు, కాఫీ కబుర్లు వంటి కార్యక్రమాల ద్వారా లీడర్-కేడర్ మధ్య ఎమోషనల్ బాండింగ్ ఏర్పడుతోందని అభిప్రాయపడ్డారు. శిక్షణకు వచ్చే కార్యకర్తలకు పార్టీ ధోరణి, సిద్ధాంతాలను వివరించడంతోపాటు... క్షేత్రస్థాయిలో ప్రభుత్వం అమలు చేస్తోన్న వివిధ పథకాల అమలు తీరుపై ఫీడ్‌బ్యాక్ తీసుకునే వీలు కలుగుతోందని సీఎం చెప్పారు. విద్య, వైద్యం, ఉపాధి వంటి అంశాల్లో పార్టీ కార్యకర్తల కుటుంబాల సంక్షేమం కోసం... వారి అభివృద్ధి కోసం ఏర్పాటు చేస్తోన్న వ్యవస్థను సమగ్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి సూచించారు. దీంట్లో భాగంగా ఎథిక్ ఎకనమిక్ ఎంపవర్మెంట్ తెస్తున్నామని చెప్పారు. ఈ నెల 29వ తేదీన పార్టీ కొత్త కార్యవర్గం బాధ్యతల స్వీకరణకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ముఖ్యమంత్రికి నేతలు తెలిపారు. మహానాడు నిర్వహణకు సంబంధించిన కమిటీల ఏర్పాటుపైనా కసరత్తు చేస్తున్నట్టు సీఎంకు పార్టీ నేతలు వివరించారు.

## చిన్నారుల ప్రాణాలకు అండగా 'ప్రాజెక్ట్ పునర్విక'

(మొదటి పేజీ తరువాయి)

వ్యవస్థాత్మక పరిష్కారానికి 'ప్రాజెక్ట్ పునర్విక'ను తీసుకొస్తున్నట్లు చెప్పారు.

**ప్రాజెక్ట్ లక్ష్యాలు ఇవే... :** అరుదైన వ్యాధులపై కేంద్ర ప్రభుత్వంతో విధానపరమైన మద్దతు బలోపేతం చేయడం, అంతర్జాతీయ సంస్థలతో కలిసి చికిత్సల ఖర్చు తగ్గించడం ఈ ప్రాజెక్ట్ ముఖ్య లక్ష్యాలుగా ఉన్నాయి. భారతీయ ఔషధ కంపెనీలతో కలిసి దేశీయ తయారీ అవకాశాలను అన్వేషించడం, దీర్ఘకాలిక పరిష్కారాలను రూపొందించడం దిశగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

అలాగే బాధిత కుటుంబాలకు మార్గదర్శకం, మానసిక ధైర్యం, ఆర్థిక సహాయం అందించే సమగ్ర సపోర్ట్ సిస్టమ్‌ను నిర్మించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు.

**వేలాది చిన్నారులకు ఆశాదీపం :** ఇది కేవలం ఒక పాలసీ నిర్ణయం కాదని, ప్రతి చిన్నారి జీవితం డబ్బుతో ముడిపడకూడదనే నిబద్ధతతో తీసుకున్న నిర్ణయమని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. "ప్రతి చిన్నారి భవిష్యత్తు వారి తల్లిదండ్రులు ఆశ కొనగలరా లేదా అన్నదానిపై ఆధారపడకూడదు" అని పేర్కొన్నారు.

ఒక్క పునర్విక కథతో ప్రారంభమైన ఈ ప్రయాణం, వేలాది చిన్నారుల జీవితాల్లో ఆశాదీపం వెలిగించే ఉద్యమంగా మారబోతోందని తెలిపారు. ఖరీదైన చికిత్సలు అడ్డంకిగా కాకుండా, ప్రతి పిల్లవాడికి సమానంగా జీవించే అవకాశం కల్పించడమే 'ప్రాజెక్ట్ పునర్విక' అసలు లక్ష్యమని మంత్రి నారా లోకేష్ వెల్లడించారు.

## ప్రజల ఇళ్లలో 'సూర్య' కాంతి

(మొదటి పేజీ తరువాయి)

దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఎస్సీ, ఎస్టీలకు వందశాతం సబ్సిడీతో సోలార్ ప్యానల్స్ అందిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఇతర వర్గాలకు 40శాతం వరకు సబ్సిడీ లభిస్తుందని పేర్కొన్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో 4606 మంది, బనగానపల్లె మండలంలో 2910 మంది ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందుతున్నారని వివరించారు. పంచమపేటలో 331 మంది లబ్ధిదారులకు ఈ పథకాన్ని అందిస్తున్నామని వెల్లడించారు.

ఈ పథకం ద్వారా నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందవచ్చని తెలిపారు. మధ్యతరగతి కుటుంబాలపై విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించవచ్చని అన్నారు. అదనంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్ ప్రభుత్వానికి అమ్ముకునే వెసులుబాటు ఉంటుందని వివరించారు. ఈ పథకం కేవలం ఉచితంగా విద్యుత్‌ను అందించడం మాత్రమే కాదని... దేశాన్ని పునరుత్పాదక శక్తి వైపు తీసుకెళ్లే గొప్ప అడుగని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.

## శనగ రైతులకు ఊరట...



(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తో శనివారం విజయవాడలోని క్యాంప్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో శనగలు, మొక్కజొన్న పంటల పరిస్థితిని సమగ్రంగా వివరించి, రైతులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, ఈ ఏడాది రాష్ట్రంలో శనగల సాగు గణనీయంగా పెరిగి, మొత్తం సుమారు 7,13,000 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి నమోదైందని తెలిపారు. ఇప్పటివరకు 94,500 మెట్రిక్ టన్నుల శనగలు కొనుగోలు పూర్తయిందని, మిగిలిన పంటను రైతులకు నష్టం కలగకుండా కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందని కేంద్రానికి వివరించారు. అదనంగా 1,78,250 మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యాన్ని పెంచాలని కేంద్రాన్ని కోరారు. మంత్రి విజ్ఞప్తికి స్పందించిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, పీఎస్ఎస్ స్కీం కింద అదనంగా 15,000 మెట్రిక్ టన్నుల శనగలు తక్షణమే కొనుగోలు చేయడానికి అనుమతి ఇస్తూ సానుకూల నిర్ణయం తీసుకున్నారు. మిగిలిన 68,750 మెట్రిక్ టన్నుల శనగలను కూడా త్వరలోనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు.

అలాగే మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ, ప్రస్తుతం కనీస మద్దతు ధర కంటే తక్కువకు పంట అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని మంత్రి కేంద్రానికి వివరించారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలవాలని కోరారు. మిర్చి, పొగాకు రైతులు క్రాప్ డైవర్షన్ చేసి మొక్కజొన్న సాగు విస్తీర్ణాన్ని పెంచారని, దీంతో దిగుబడులు అధికంగా వచ్చినట్లు మంత్రి తెలిపారు. అదేవిధంగా ఈ ఏడాది ఇరాన్ యుద్ధ ప్రభావం, ఈతనాల ఉత్పత్తిలో బ్రోకెన్ రైస్ వినియోగం పెరగడం వల్ల మొక్కజొన్నకు డిమాండ్ తగ్గిన పరిస్థితి ఏర్పడిందని వివరించారు. మొక్కజొన్న పంట కొనుగోలు పీడీఎస్ స్కీంలో లేకపోయినప్పటికీ, ప్రస్తుత ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై కేంద్ర ఆహారం, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ వెంకటేష్ జోషి తో వెంటనే మాట్లాడి, మొక్కజొన్న కొనుగోలు అంశంపై త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకునేలా చర్యలు చేపడతామని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, కేంద్రంతో సమన్వయం చేసుకుని రైతులకు పూర్తి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతుల సంక్షేమం, పంటలకు గిట్టుబాటు ధరలు, మార్కెట్ సదుపాయాలు కల్పించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

## మంత్రి సత్యకుమార్ కృషితో... రైతన్నల దశాబ్దాల కల సాకారం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి బుదలమ్మ చెరువు (బుదనంపల్లి) నుండి చింతకుంట చెరువుకు ఫీడర్ (లింక్) ఛానల్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతంలోని వందలాది ఎకరాలకు సాగునీరు అందడమే కాకుండా చెరువు పరిసర ప్రాంతాల్లోని బోర్లలో నీటిమట్టం కూడా పెరిగి రైతులకు లబ్ధి చేకూరనుంది. యోగి వేమన రిజర్వాయర్ ద్వారా బుదనంపల్లి చెరువుకు వచ్చే జలాలను ఈ ఫీడర్ ఛానల్ ద్వారా చింతకుంట చెరువుకు మళ్లించడం ద్వారా ప్రాంతంలోని నీటి కొరతను తగ్గించడమే లక్ష్యమని తెలిపారు.



**బుదలమ్మ చెరువు ప్రాముఖ్యత & ప్రస్తుత పరిస్థితి:** శ్రీ సత్యసాయి జిల్లాలోని ముదిగుబ్బ మండలం బుదనంపల్లి గ్రామ పరిసర ప్రాంతంలో ఉన్న బుదలమ్మ చెరువు రెండు కొండల మధ్య లోతైన ప్రాంతంలో నిర్మించబడింది. సుమారు 80 మీటర్ల పొడవు గల మట్టి కట్టతో నిర్మించబడిన ఈ చెరువుకు 14.39 ఎంసీఎఫ్‌టీ నీటి నిల్వ సామర్థ్యం ఉండగా, 15 ఎకరాల ఆయకట్టు ఉంది. గతంలో తూము ద్వారా నీటిని విడుదల చేసి తడి పంటలు సాగు చేసేవారు. చెరువుకు ఉన్న ఎడమ, కుడి ఫీల్డ్ ఛానెల్స్ ద్వారా ఆయకట్టు భూములకు నీరు చేరేది. అదనంగా, మిగిలిన నీరు చింతకుంట చెరువుకు చేరి అక్కడి సాగునీటి అవసరాలను కూడా తీర్చేది. అయితే, భూగర్భ జలాల పెంపుదల మరియు మెట్టిపంటల అభివృద్ధి దృష్ట్యా గతంలో తూమును పూర్తిగా మూసివేయడంతో ప్రస్తుతం ఆయకట్టు సాగు తగ్గిపోయింది. ప్రస్తుతం చెరువులో సుమారు 50% నీటి నిల్వ మాత్రమే ఉన్నప్పటికీ, ఫీల్డ్ ఛానెల్స్ వినియోగంలో లేవు.

**ప్రధాన సమస్యలు:** బుదలమ్మ చెరువు చుట్టూ ఉన్న ఎత్తైన కొండల కారణంగా చింతకుంట చెరువుకు నేరుగా ఫీడర్ ఛానల్ నిర్మాణం సాంకేతికంగా కష్టంగా ఉంది. తూము మూసివేయడంతో రైతులు సాగుకు ఆసక్తి చూపడం లేదు.

**ఫీడర్ ఛానల్ నిర్మాణంతో లాభాలు:** లింక్ ఛానల్ పనుల ద్వారా పలు ప్రయోజనాలు కలుగుతాయని మంత్రి తెలిపారు. సుమారు 200 ఎకరాలకు సాగునీరు అందుబాటులోకి వస్తుందన్నారు. "" భూగర్భ జలాలు పెరిగి బోర్‌వెల్‌లు రీచార్జ్ అవుతాయి పశువులకు తాగునీటి సదుపాయం మెరుగుపడుతుంది. తక్కువ వర్షపాతం ప్రాంతమైన ముదిగుబ్బ మండలంలో స్థిరమైన వ్యవసాయానికి బలం చేకూరుతుంది. వీబీజీ - రామ్‌జీ పథకం ద్వారా గ్రామీణులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఈ పనులను సుమారు రూ.25 లక్షల వ్యయంతో చేపడుతున్నాశీ వీర్ నిర్మాణం, రాళ్ల తొలగింపు వంటి కీలక పనులు ఇందులో భాగమని మంత్రి వివరించారు. ఫీడర్ ఛానల్ నిర్మాణం కోసం తమ భూములను స్వచ్ఛందంగా అందించిన రైతుల సహకారం అభినందనీయమని కొనియాడారు.

**ప్రభుత్వ సంకల్పం:** ప్రతి చుక్క నీరు రైతుకు ఉపయోగపడాలి - ప్రతి కుటుంబానికి ఉపాధి, అభివృద్ధి చేరాలి అనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని మంత్రి గారు తెలిపారు. ఈ పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని, గ్రామస్థులు మరియు రైతులు సహకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీవో సూర్యనారాయణ రెడ్డి, ఏపీడి చలపతి, ఎమ్మార్వో మహేశ్వరరెడ్డి, ఎంపీడీవో శకుంతల, వీబీజీ - రామ్‌జీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, స్థానిక ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భవిష్యత్తును కాంగ్రెస్ కాలరాసింది

(మొదటి పేజీ తరువాయి)




కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ, విపక్ష నేతలకు మహిళలంటే ఎంత వ్యతిరేకత ఉందో ఈ ఘటనతో స్పష్టమైందన్నారు. మహిళా బిల్లును వీగిపోయేలా చేసేందుకు రాజకీయ కుట్రలు పన్నారని ఆరోపించారు. తాజా బిల్లు ప్రకారం ప్రతిచోటా 50 శాతం సీట్లు పెరుగుతాయని తెలిపారు.

బిల్లును అడ్డుకునేందుకు అనేక మెలికలు పెట్టారని, బిల్లుకు సవరణ చేసి తిరిగి తీసుకొస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పినా వినలేదని విమర్శించారు. మహిళలకు రిజర్వేషన్ ఇవ్వడం కాంగ్రెస్, దాని మిత్రపక్షాలకు అసలు ఇష్టం లేదని అన్నారు. దేశంలోని మహిళలకు సముచిత స్థానం కల్పించాలనే లక్ష్యంతోనే ఈ బిల్లు తీసుకొచ్చామని స్పష్టం చేశారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, డీలిమిటేషన్‌పై విపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆరోపించారు. గతంలో నాలుగుసార్లు డీలిమిటేషన్ జరిగిందని, ఇవాళ కొత్తగా జరుగుతున్నది ఏమీ కాదన్నారు. 1971 జనాభా లెక్కల ప్రకారం 550 సభ్యులు ఉండాలని అప్పటి నాయకులే నిర్ణయించారని గుర్తు చేశారు.

ప్రస్తుతం దేశ జనాభా 140 కోట్లకు చేరిందని, కొన్ని లోక్‌సభ నియోజకవర్గాల్లో 40 లక్షల మంది ప్రజలు ఉన్నారని, అలాంటి పరిస్థితుల్లో సీట్లు పెంచడం తప్పనిసరి అని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన బిల్లులో కూడా డీలిమిటేషన్ అంశాన్ని చేర్చారని గుర్తు చేశారు.

గతంలో మీరు చేసిన ప్రకారమే ఇప్పుడు డీలిమిటేషన్ చేస్తున్నామని, మేమేమీ కొత్తగా మార్చలేదని స్పష్టం చేశారు. డీలిమిటేషన్ కమిషన్ సూచించిన విధంగానే సీట్లు పెరుగుతాయని, మరి ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు.

మహిళలకు న్యాయం చేసేంత వరకు ఎన్డీఏ ప్రభుత్వం తన ప్రయత్నాలు ఆపదని పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ వైఖరిని నిరసిస్తూ విజయవాడలో భారీ మహిళా ఆక్రోశ సభ నిర్వహిస్తామని ప్రకటించారు.

## నిడదవోలు - దువ్వాడ రైల్వే లైన్ విస్తరణపై మంత్రి కందుల దుర్గేష్ హర్షం

**నిడదవోలు(జర్నలిస్ట్ ఫైల్) :** నిడదవోలు - దువ్వాడ మధ్య 3, 4 రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం నిడదవోలులో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన కీలక విషయాలను పంచుకున్నారు.



**పచ్చిపులుసు వీరభద్రరావుకు ఘన నివాళి :** ఇటీవల స్వర్గస్తులైన నిడదవోలు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పచ్చిపులుసు వీరభద్రరావు సంతాప సభలో మంత్రి దుర్గేష్ పాల్గొన్నారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన ఈ సభలో వీరభద్రరావు చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వీరభద్రరావు అందించిన సహకారం, ఆత్మీయత మరువలేనివి. ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం ఆయన నిస్వార్థంగా చేసిన కృషి ఎందరికో ఆదర్శం. భౌతికంగా ఆయన మన మధ్య లేకపోయినా, ఆయన ఆశయాలు, నాయకత్వ పటిమ ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయని కొనియాడారు.

**రైల్వే అభివృద్ధి ఌ భారత్ మాల ప్రాజెక్టు :** నిడదవోలు ప్రాంత అభివృద్ధిపై మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ రైల్వే లైన్ల విస్తరణతో ఈ ప్రాంత ముఖచిత్రం మారబోతోందన్నారు. అలాగే భారత్ మాల ప్రాజెక్టును తాడేపల్లిగూడెం నిట్ నుండి నిడదవోలు, కొవ్వూరు మీదుగా నిర్మిస్తే ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉంటుందని సీఎం చంద్రబాబు నాయుడు, కేంద్ర ప్రభుత్వం మరియు ఎంపీ పురందేశ్వరిలకు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. నిడదవోలు రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు అద్భుతంగా సాగుతున్నాయని, రైళ్ల హాల్టింగ్ సమస్యను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు.

**బాధిత రైతుకు పరామర్శ :** అనంతరం మంత్రి దుర్గేష్ రాజమండ్రిలోని సాయి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి వెళ్లారు. పొలంలో వరి కోత సమయంలో ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స పొందుతున్న కంసాలిపాలెం గ్రామస్థుడు, మాజీ నీటి సంఘం అధ్యక్షులు అత్తులూరి శ్రీనివాస్ ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో చర్చించి, మెరుగైన వైద్యం అందించాలని సూచిస్తూ శ్రీనివాస్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## మైనారిటీల సంక్షేమానికి గత ప్రభుత్వం తూట్లు

(మొదటి పేజీ తరువాయి)

విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుంచి రెండవ విడతలో హజ్ యాత్రకు వెళ్తున్న 177 మంది యాత్రికుల బృందానికి మంత్రి ఫరూక్ సారథ్యంలో వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి ఫరూక్ తోపాటు మైనారిటీ వ్యవహారాల సలహాదారుడు ఎంఏ షరీఫ్, ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫారూక్ షుబ్లీ, హజ్ కమిటీ చైర్మన్ హసన్ భాషా, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ మౌలానా హజ్ కమిటీ సీఈవో గౌస్ పీర్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ యాకూబ్ భాషా, విజయవాడ లా అండ్ ఆర్డర్ డీసీపీ మురళీ కృష్ణ తదితరులు రెండవ దశలో వెళ్తున్న హజ్ యాత్రికులకు జెండా ఊపి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ ప్రసంగిస్తూ ఐదేళ్ల పాలనలో గత ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపులతో అన్ని వర్గాల ప్రజా సంక్షేమాన్ని, రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేసిందని విమర్శించారు. మైనారిటీల పట్ల గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించిందన్నారు. లి లి2014-2019లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలోని ప్రభుత్వం కడపలో హజ్ భవన్ ను నిర్మించేందుకు నిధులు కేటాయించి దాదాపుగా పూర్తిచేయడం జరిగిందన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం సొంత జిల్లాలో హజ్ భవన్ చివరి దశలో ఉన్న పెండింగ్ పనులను కూడా పూర్తి చేయలేదని, ముఖ్యమంత్రి హోదాలో సొంత జిల్లాలో కూడా అభివృద్ధిని నిలిపివేసిన ఘనత గత ముఖ్యమంత్రి దేనని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ కక్ష సాధింపు చర్యలతో స్వయం ఉపాధి రుణాలను , మసీదులు, షాదీఖానాల నిధులను కూడా రద్దు చేసి మైనారిటీల అభివృద్ధిని గత ప్రభుత్వ పాలకులు అడ్డుకున్నారని మంత్రి ఫరూక్ దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజావేదికను కూల్చివేసినప్పుడే ఆ ప్రభుత్వ క్రూరత్వం ప్రజలకు అర్థమైందని అన్నారు. భవిష్యత్ ప్రణాళికలో అమరావతిలో హజ్ భవన్ నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు స్థలాన్ని కేటాయించారని, త్వరలోనే అక్కడ పనులు ప్రారంభిస్తామని మంత్రి ఫరూక్ హర్షద్వానాల మధ్య ప్రకటించారు. హజ్ యాత్ర విజయవంతం కోసం కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు సహకారంతో, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రానికి సౌదీ అరేబియా విమాన సర్వీసుల్లో ప్రాధాన్యత లభించిందని అన్నారు. కూటమి ప్రభుత్వం నేతృత్వంలో హజ్ యాత్రకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు, గన్నవరం నుంచి వెళు న్న వారికి రూ. లక్ష ఆర్థిక సహాయం, ప్రత్యేకంగా విడిది క్యాంపులు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుండి యాత్రికుల సంఖ్యను రానున్న కాలంలో భారీగా పెంచేందుకు కార్యాచరణ ప్రణాళిక అమలు చేసేందుకు నిర్ణయించడం జరిగిందని పేర్కొన్నారు. అందుకు కావాల్సిన అన్ని చర్యలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం శ్రీకారం చుడుతుందని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. హైదరాబాద్, బెంగళూరు తదితర ఎంబార్కేషన్ కేంద్రాల నుంచి వెళ్లే వారికి కూడా ఆయా రాష్ట్రప్రభుత్వాలతో సమన్వయం చేస్తూ రాష్ట్ర మైనారిటీ మంత్రిత్వ శాఖ అన్ని చర్యలను చేపట్టిందని మంత్రి ఫరూక్ వెల్లడించారు.

**మంత్రి ఫరూక్ నిరంతర పర్యవేక్షణతో.. :** విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుంచి హజ్ యాత్రకు వెళ్తున్న వారికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా సౌకర్యాలు కల్పించడానికి మైనారిటీ మంత్రి ఫరూక్ చేసిన నిరంతర పర్యవేక్షణ, కృషి పట్ల యాత్రికులు ప్రశంసల జల్లు కురిపించారు. విడిది కేంద్రం వద్ద పలువురు యాత్రికులను మంత్రి ఫరూక్ వారి వద్దకు వెళ్లి పలకరిస్తూ, యోగక్షేమాలు అడిగి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా, విజయవంతంగా యాత్ర పూర్తి చేసి రావాలని సూచించడం జరిగింది. రాష్ట్ర, దేశ, ప్రపంచ అభివృద్ధి, శాంతికోసం కూడా ప్రార్థించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనారిటీల సంక్షేమానికి, వారి పవిత్ర యాత్రలకు అత్యంత ప్రాధాన్యతనిస్తుందని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు. అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాట్ల తో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో హజ్ యాత్రికులకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని మంత్రి తెలిపారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా శీతల వసతి, రుచికరమైన ఆహార సదుపాయాలు, వైద్య సేవలు అందుబాటులో ఉంచడం జరిగిందని అన్నారు. మైనారిటీ మంత్రిత్వ శాఖ, హజ్



కమిటీ సభ్యులు సమన్వయంతో అన్ని ప్రభుత్వ శాఖలతో కలిసి హజ్ యాత్రకు ఏర్పాట్లు చేయడంతో యాత్రికులందరికీ ఎలాంటి ఇబ్బందులు కలగలేదన్నారు. పోలీసు శాఖ ద్వారా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు జరిగాయని అన్నారు. లి

**తేలికపాటి ఆహారం తీసుకోవాలి.. యాత్రికులకు సూచించిన మంత్రి ఫరూక్ :** సౌదీ అరేబియాలో ఎండలు తీవ్రత ఎక్కువ గా ఉన్నందున యాత్రికులు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఫరూక్ సూచించారు. ముఖ్యంగా యాత్రలో ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నూనెతో చేసిన వంటకాలు తినకుండా నియంత్రణ పాటించి, త్వరగా జీర్ణమయ్యే తేలికపాటి ఆహారం తీసుకోవాలన్నారు. మక్కా, మదీనాలలో వసతి గృహాల దూరం పెరిగిన దృష్ట్యా సమయపాలన పాటించాలని సూచించారు. అక్కడి వసతి గృహాల్లో గ్యాస్ స్టవ్‌ల వాడకంపై ఉన్న ఆంక్షలను ఖచ్చితంగా గౌరవించాలని హజ్ యాత్రి కులకు మంత్రి ఫరూక్ సూచించారు. కాగా గన్నవరం వద్ద ఎస్ఎం కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన విడిది వద్ద హజ్ యాత్ర కు వెళ్తున్న వారికి ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలు, జాగ్రత్త లు, యాత్రలో అక్కడ పాటించాల్సిన నియమ, నిబంధనలు, ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవల వివరాలు, తదితర అంశాలపై పూర్తిస్థాయిలో మత పెద్దలు, హాజీలు, అధికారులు వివరించారు. హజ్ యాత్రకు వెళ్తున్న వారు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన అన్ని రకాల సౌకర్యాలు, సేవలు చాలా బాగున్నాయని, ప్రశంసిస్తూ సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి ఫరూక్ కు, సేవలందించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## ఏపీలో అత్యవసర వైద్య సేవల్లో కొత్త శకం




(మొదటి పేజీ తరువాయి)

జూన్ 2025 నుండి మార్చి 2026 మధ్య కాలంలో మొత్తం 6,39,809 అత్యవసర కేసులకు తక్షణం స్పందించి సరికొత్త రికార్డు సృష్టించింది.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రజలకు అత్యుత్తమ అత్యవసర వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్న భవ్య హెల్త్ సర్వీస్, గత 10 నెలల్లో అత్యంత సమర్థవంతంగా సేవలందించి వేలాది ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషించింది. అత్యాధునిక సాంకేతికత, అంకితభావంతో కూడిన సిబ్బందితో మారుమూల ప్రాంతాల్లో కూడా 'గోల్డెన్ అవర్'లో వైద్య సహాయం అందిస్తూ రాష్ట్ర ఆరోగ్య రంగంలో నమ్మకమైన భాగస్వామిగా నిలిచింది.

రాష్ట్రవ్యాప్తంగా అందిన కాల్స్ లో ప్రధానంగా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడటంలో భవ్య హెల్త్ కేర్ బృందం కీలకంగా వ్యవహరించింది.

ప్రమాద బాధితుల రక్షణ: 92,372 రోడ్డు ప్రమాద కేసులు, 40,450 ఇతర ప్రమాద (ఒత్తుబమ్ము) కేసుల్లో తక్షణ వైద్యం అందించారు.

మాతృ-శిశు రక్షణ: 87,320 మంది గర్భిణీ స్త్రీలకు మరియు 11,614 మంది నవజాత శిశువులకు సురక్షితమైన రవాణా, అత్యవసర చికిత్స అందించారు.

గుండె సంబంధిత అత్యవసరాలు: ముఖ్యంగా గత మూడు నెలల్లోనే 9,183 మంది గుండెపోటు బాధితులను 'గోల్డెన్ అవర్'లో ఆసుపత్రులకు చేర్చి ప్రాణాలు నిలబెట్టారు.

**సాంకేతికత మరియు సౌకర్యాలు:** భవ్య హెల్త్ కేర్ తన సేవల నాణ్యతను పెంచేందుకు పలు కీలక మార్పులు చేపట్టింది.

1. ఫ్లీట్ అప్‌గ్రేడేషన్: పాత వాహనాల స్థానంలో అత్యాధునిక వైద్య పరికరాలతో కూడిన 190 కొత్త అంబులెన్స్‌లను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం మొత్తం 731 వాహనాలు నిరంతరం అందుబాటులో ఉన్నాయి.
2. అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్: ప్రతి అంబులెన్స్‌లో వెంటిలేటర్లు, డెఫిబ్రిలేటర్లు ఆక్సిజన్ సపోర్ట్ వంటి సౌకర్యాలతో పాటు శిక్షణ పొందిన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్ అందుబాటులో ఉంటారు.
3. 24/7 కంట్రోల్ రూమ్: అత్యాధునిక జీపీఎస్ టెక్నాలజీ ద్వారా అంబులెన్స్‌లను ట్రాక్ చేస్తూ, కాల్ అందిన వెంటనే తక్కువ రెస్పాన్స్ టైమ్‌లో బాధితుల వద్దకు చేరుకునేలా వ్యవస్థను రూపొందించారు.

**సేవల విభజన :** డైరెక్ట్ రెస్పాన్స్ : 4,33,242 మందిని నేరుగా ప్రమాద స్థలాల నుండి తరలించారు.

హాస్పిటల్ ట్రాన్స్‌ఫర్ : మెరుగైన చికిత్స కోసం 2,06,567 మందిని ఉన్నత స్థాయి ఆసుపత్రులకు తరలించారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన టెలిమెడిసిన్ విధానం ద్వారా, అంబులెన్స్‌లో ఏర్పాటు చేయబడిన జఖుఎ కెమెరాలు, మొబైల్ డేటా టెర్మినల్స్ సాయంతో 18 మంది ప్రత్యేక వైద్యుల బృందం లైవ్‌గా బాధితుల స్థితిని పర్యవేక్షిస్తూ, ఆసుపత్రికి చేరకముందే అవసరమైన చికిత్సలు అందిస్తోంది.

సకాలంలో స్పందించే రెస్పాన్స్ టైమ్, అత్యాధునిక లైఫ్ సపోర్ట్ సిస్టమ్స్‌తో ఘటనా స్థలాల నుండి మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రుల మధ్య తరలింపుల్లో భవ్య హెల్త్ కేర్ అంకితభావంతో నిరంతరం పనిచేస్తోంది..

ఆరోగ్య అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు వెంటనే 108కి డయల్ చేసి ఈ ఉచిత, ప్రాణరక్షక సేవను వినియోగించుకోవాలని ప్రజలను కోరుతున్నాము.

## ఏపీకి మరో రెండు రైల్వే లైన్లు.. రూ.9,889 కోట్లకు కేంద్రం ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల గుండా సాగే ఈ ప్రాజెక్టులో గోదావరిపై 4.3 కిలోమీటర్ల పొడవైన కొత్త రైల్వే వంతెన నిర్మించనున్నారు. అదనంగా 3 మెగా వంతెనలు, 58 పెద్ద వంతెనలు, 416 చిన్న వంతెనలు, 73 ఆర్‌యూబీలు, 3 ఆర్‌ఓబీలు, 2.7 కి.మీ పొడవైన వయాడక్ట్ నిర్మాణం చేపడతారు.

అన్నవరం, అంతర్వేది, ద్రాక్షారామం వంటి పుణ్యక్షేత్రాలకు రైలు అనుసంధానం మరింత మెరుగుపడనుంది. ఈ కారిడార్‌ను హైస్పీడ్‌కు అనుకూలంగా రూపొందించడంతో పాటు 'కవచ్' రక్షణ వ్యవస్థను కూడా అమలు చేయనున్నారు.

ప్రాజెక్టు పూర్తయితే అదనంగా 29 మిలియన్ టన్నుల సరకు రవాణా సాధ్యమవుతుందని, ఏటా 51.5 కోట్ల కిలోల కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయని అధికారులు తెలిపారు. అలాగే రూ.1,151 కోట్ల సరకు రవాణా వ్యయం ఆదా అవుతుందని అంచనా వేస్తున్నారు. నిర్మాణ దశలో 135 లక్షల మానవ పని దినాలు లభించనున్నాయి.

# మహిళా రిజర్వేషన్‌తో లింక్ అన్యాయం



**-సీట్ల పునర్విభజనపై కేంద్రంపై ఎంసీపీఐయు ఫైర్**

**బెల్లంపల్లి(జర్నలిస్ట్ ఫైల్) :**131వ రాజ్యాంగ సవరణ పేరుతో సమైక్యవాదాన్ని బలహీనపరిచే విధంగా తీసుకొస్తున్న డిలిమిటేషన్ బిల్లును వ్యతిరేకించాలని ఎంసీపీఐయు పార్టీ మంచిర్యాల జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు శనివారం బెల్లంపల్లి పట్టణంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్ర ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం హడావిడిగా ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లుతో డిలిమిటేషన్‌ను అనుసంధానం చేయడం అన్యాయమని మండిపడ్డారు. వారు మాట్లాడుతూ – మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఎవరికీ అభ్యంతరం లేదని, కానీ దానిని సెంటిమెంట్‌గా ఉపయోగించి నియోజకవర్గాల పునర్విభజనలో రాజకీయ లాభాల కోసం ప్రయత్నించడం తగదని విమర్శించారు. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కేంద్రం రాజకీయ లాభాల కోసం ఈ చర్యలు చేపడుతోందని ఆరోపించారు. పార్లమెంట్ సాక్షిగా ఎన్డీఏ ప్రభుత్వ కుట్రలను వెలుగులోకి తెచ్చామని, మహిళా రిజర్వేషన్ బిల్లు ముసుగులో డిలిమిటేషన్ బిల్లును తీసుకురావడం పై సరైన చర్చ జరగలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున పోరాడాలని పిలుపునిచ్చారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా పార్లమెంట్ సీట్లను పెంచే ప్రయత్నం జరుగుతోందని, దీనివల్ల దక్షిణ భారత రాష్ట్రాలకు అన్యాయం జరిగే అవకాశం ఉందని తెలిపారు. 2026 జనాభా లెక్కల ఆధారంగా సీట్లను పెంచాలని, ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐయు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్ర మంత్రి లక్ష్మణ్ కుమార్ పర్యటన



**పెగడపల్లి, ఏప్రిల్ 19 (జర్నలిస్ట్ ఫైల్) :** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం అయితపల్లి, ఏడు మోటలపల్లి గ్రామాలలో ఫ్యాక్స్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవానికి ఆదివారం రోజున వస్తున్నారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచ్, ఉప సర్పంచ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు, రైతు సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయంతో చేయాలని అన్నారు.

# వేసవిలో తాగు నీటి సమస్యను పరిష్కరించిన కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్



**తనకల్లు, ఏప్రిల్ 19 (జర్నలిస్ట్ ఫైల్) :** తనకల్లు మండల పరిధిలోని మండ్లి పల్లి గ్రామంలో వేసవి సందర్భంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్తులు కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్, దృష్టికి తీసుకెళ్లగా ఆయన తక్షణం స్పందించి ఎంపీడీవో రామా నాయక్,కు ఆదేశాలు జారీ చేయగా ఎంపీడీవో రామా నాయక్, శనివారం తన సిబ్బందితో గ్రామాన్ని సందర్శించి తాగునీటి బోరు పైపులు, మోటారు, ఏర్పాటుచేసి తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ బోరు వేసి చాలా కాలమైనా అలాగే ఉండిపోయిందని, ఈ వేసవిలో తీవ్ర తాగునీటి సమస్య ఏర్పడగా ప్రస్తుత శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్, స్పందించి అధికారులను పంపి తాగునీటి సమస్య తీర్చినందుకు ఎమ్మెల్యే కి, ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామా నాయక్, గ్రామస్తులు రమేష్, ఓబులేసు, చిరంజీవి, వెంకటస్వామి, రమణ, వెంకటరమణ, నరసింహులు, వేమ నారాయణ, నరసింహులు, వేమ నారాయణ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# రౌడీ షీటర్లకు ప్రొద్దుటూరు వన్ టౌన్ సి.ఐ కొండారెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్



జిల్లా ఎస్పీ విశ్వనాథ్ ఆదేశాల మేరకు రౌడీ షీటర్లకు ప్రొద్దుటూరు వన్ టౌన్ సి.ఐ కొండారెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్ రాజశ్రీ కడప జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మరియు ప్రొద్దుటూరు ఏఎస్పీ పర్యవేక్షణలో ప్రొద్దుటూరు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ నందు సిఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో వివిధ నేరాలలో ముద్దాయిలై పోలీస్ స్టేషన్ నందు రౌడీ షీటర్ గా నమోదైన వ్యక్తులకు కౌన్సిల్ నిర్వహిస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లయితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడమైనది సత్ప్రవర్తనతో ఉండి మంచి జీవితం కొనసాగిస్తున్నట్లయితే వారందరినీ వారి అర్హతను బట్టి రౌడీషీట్లు పై అధికారుల యొక్క ఆదేశాల మేరకు తొలగించబడుతుంది. ధిక్కరించి ఏవైనా నేరాలలో పాల్గొన్నట్లయితే జిల్లా బహిష్కరణతో పాటు పి.డి act నమోదు చేయబడుతుంది అని హెచ్చరించారు

# శ్రీ సరస్వతి శిశు మందిర్ ఆఫ్ ఎక్సెన్సీ హై స్కూల్‌లో ట్రాఫిక్ రూల్స్‌పై ఎస్సే పోటీలు




**జగిత్యాల, ఏప్రిల్ 19 (జర్నలిస్ట్ ఫైల్) :** పట్టణంలోని ఎస్ఎస్ఎస్ఎం హై స్కూల్‌లో ఆర్టీసీ ట్రాఫిక్ రూల్స్ మరియు రోడ్డు భద్రత అనే అంశంపై ఎస్సే రైటింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల వర్గాలు తెలిపాయి. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల్లో కొక్కుల కృష్ణ శ్రీ (7వ తరగతి), మంతెన వివేక్ శ్రీ వల్లభ్ (8వ తరగతి), ఆకుల దీప్తి (9వ తరగతి) విజేతలుగా నిలిచారు. వారికి జగిత్యాల డిపో మేనేజర్ కె. కల్పన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనగల్ల రాజేందర్ మాట్లాడుతూ విద్యార్థులు ట్రాఫిక్ నియమాలపై చక్కటి అవగాహనతో తమ ప్రతిభను ఎస్సే రూపంలో అద్భుతంగా ప్రదర్శించారని ప్రశంసించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులలో సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని తెలిపారు. ఉపాధ్యాయ బృందం కూడా విజేతలను అభినందించింది.

# స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్





**జర్నలిస్ట్ ఫైల్:** కడప జిల్లా ఎర్రగుంట్ల మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామంలో స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ మాట్లాడుతూ ప్రభుత్వం 5, గత 14 నెలల నుండి స్వచ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం మూడో శనివారం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా మన పరిసరాలను శుభ్రపరచడమే కాకుండా మనం వాడుతున్న ప్రతి వస్తువుకు విలువ ఉన్నది అని ఏది వ్యర్థము కాకుండా రీసైక్లింగ్ విధానం ద్వారా ప్రతి వస్తువును మరల ఉపయోగించుకునే విధానం అని తెలిపారు. మన పెద్దవారు మనకు ఏ విధమైనటువంటి వాతావరణం అనుగ్రహించారో ఆ విధంగానే మనము కూడా రాబోయే తరాలకు అటువంటి వాతావరణాన్ని అందించాలని సూచించారు. ప్రతిరోజు ప్రతి కుటుంబము మూడు నుండి నాలుగు కేజీల వరకు చెత్తను తీస్తున్నాము అది మన ఇంట్లో ఉండే చెత్త కావచ్చు మనము వాడుతున్నటువంటి ప్యాకింగ్ వస్తువులు వంటి ద్వారా కూడా మనము చెత్తను చేస్తున్నాను ప్రతి గ్రామంలో చెత్తను తీసివేయకుండా ఉంటే ఆ గ్రామం అపరిశుభ్రంగా ఉంటుంది. అటువంటి గ్రామంలో ఉండలేము కాబట్టి అటువంటి చెత్తను పూర్తిగా మనము వినియోగం లోకి తీసుకోవాలి ప్రతి వస్తువు ప్లాస్టిక్ వస్తువు ఏదైనా సరే మన వినియోగంలోకి తీసుకోవాలి అని అలా తీసుకోవడం ద్వారా గ్రామం కూడా శుభ్రంగా ఉంటుందని తెలియజేశారు. ఇదే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలియజేశారు. అదేవిధంగా ఈనెల యొక్క తీసుకున్న కార్యక్రమం జలమే మనకు జీవనం అని తెలియజేశారు. ప్రతి గ్రామము ,మండలం,జిల్లా స్థాయిలో కార్యక్రమం నిర్వహిస్తున్నారని, ఎక్కడైనా వర్షం పడితే ఆ ప్రాంతంలోనే నిలువ ఉండేటట్లు చూసుకోవాలని తెలియజేశారు ఆ వర్షము నీరు రాబోయే దినాలలో మనకు ఉపయోగంగా ఉంటుందని తెలియజేశారు. ఆ విధంగా నీరు మనం దాచుకోకుండా ఉంటే రాబోయే దినాలలో నీరు లేకుండా ఆ ప్రాంతం ఉంటుంది అని ఈ భూగర్భ జలాన్ని బ్యాంకు యొక్క డిపాజిట్ గా చక్కగా సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా మనము నీటిని వృధా చేయకుండా వర్షాలు పడినటువంటి నీటిని వ్యక్త పరచకుండా జాగ్రత్తగా దాచుకోవాలని తెలిపారు ఇంక భూగర్భ జలాల యొక్క ప్రాముఖ్యతను గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ, జెడ్పీ సీఈవో, జమ్మలమడుగు ఆర్డిఓ, ఎర్రగుంట్ల తహసిల్దార్, ఎర్రగుంట్ల 'ఎంపీడీవో, ప్రజా ప్రతినిధి సురేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ బిజెపిది బడే బాయ్ చోటే బాయ్ ఒప్పందం – మాజీ మంత్రి హరీష్ రావు



**-లోక్ సభలో బిఆర్ఎస్ ఎంపీలు లేని లోటు తెలుస్తోంది**

**జగిత్యాల, ఏప్రిల్ 19 (జర్నలిస్ట్ ఫైల్) :** లోక్ సభలో బిఆర్ఎస్ ఎంపీలు లేని లోటు తెలుస్తోందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. రేపు జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగే బిఆర్ఎస్ బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించడానికి కేటిఆర్ తో విచ్చేశారు. అంతకుముందు మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆత్మీయంగా పలకరించిన హరీష్ రావు కేటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. బీజేపీ ఎంపీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీలు పెదవులు మూసుకుని కూర్చున్నారని మండిపడ్డారు. లోక్‌సభలో బీఆర్ఎస్ ఎంపీలు లేని లోటు తెలుస్తుదన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బీజేపీ ఎంపీ తేజస్వి సూర్యపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ పై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య మాటలు యావతు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీశాయని వ్యాఖ్యానించారు. బీజేపీ ఎంపీని కిషన్ రెడ్డి వెనుకేసుకొస్తున్నారని ఆరోపించారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భారత్ – పాక్ విభజనతో తెలంగాణను పోల్చుతారా అని మండిపడ్డారు. మహిళ బిల్లు ను డీలిమిటేషన్‌తో ఎందుకు ముడి పెట్టారని ప్రశ్నించారు. మెజారిటీ లేకున్నా బిల్లు పెడతారా అని నిలదీస్తూ రాజకీయం కోసమే బిల్లు ప్రవేశపెట్టారని మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ కార్యకర్తలు బిజెపి ఎంపీల ఇల్లులు ముట్టడిస్తే రేవంత్ రెడ్డి కేంద్రమంత్రి ఇంటికి టిఫిన్ కి వెళ్తున్నారని హరీష్ రావు ధ్వజమెత్తారు. వీరిద్దరిది చోటే బాయ్ బడే బాయ్ ఒప్పందమని హరీష్ రావు స్పష్టం చేశారు. జిల్లా అధ్యక్షులు విద్యాసాగర్ రావు ఎమ్మెల్సీ రమణ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాజీ జడ్పీచైర్మన్ దావా వసంత సురేష్ ప్రశాంత్ కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ పలువురు పాల్గొన్నారు.

# జాతీయ వాగ్దేవి పురస్కార గ్రహీత చెరుకు మహేశ్వర శర్మకు ఘన సన్మానం



**రాయికల్, ఏప్రిల్ 19 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, జాతీయ తెలుగు సారస్వత పరిషత్, తెలుగు భాష చైతన్య సమితి, సర్వేజన ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రదానం చేసిన జాతీయ వాగ్దేవి పురస్కారం అందుకున్న తెలుగు పండితులు చెరుకు మహేశ్వర శర్మను రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సముదాయం ప్రధానోపాధ్యాయులు కాపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. తమ పాఠశాలకు చెందిన తెలుగు పండితులు చెరుకు మహేశ్వర శర్మ రాష్ట్ర స్థాయిలో కందుకూరి వీరేశలింగం పంతులు స్మారక జాతీయ వాగ్దేవి పురస్కారం అందుకోవడం గర్వకారణమని ప్రధానోపాధ్యాయులు కాపు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆయన సాధించిన ఈ గుర్తింపు పాఠశాలకే కాకుండా రాయికల్ పట్టణానికి కూడా గౌరవాన్ని తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి. రాజశేఖర్, అయిత పద్మ, గుండేటి తరంగిణి, ఏనుగు రజిత, పుర్రె రమేష్, సంగాత్రి శోభ, ఎం.డి. రాజమహ్మద్ తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు.

## శివాజీ బస్తీ -హిందూ సమ్మేళనం ఆహ్వానం పోస్టర్ ఆవిష్కరణ



**జగిత్యాల, ఏప్రిల్ 19 (జర్నలిస్ట్ ఫైల్) :** శివాజీ బస్తీ – హిందూ సమ్మేళనం ఆహ్వానం పోస్టర్ ను శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొండ లక్ష్మణ్ పాల్గొని మాట్లాడారు. "గడపలోనే కులం గడప దాటితే మనమంతా హిందువులం" శివాజీ బస్తీ హిందూ సమ్మేళనం ఆధ్యాత్మిక మహాసభ ను ఈ నెల 24 శుక్రవారం రోజున సాయంత్రం 5:30 గంటలకు వంజరి సంఘ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ క్రమంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం సాంస్కృతిక కార్యక్రమాలు వక్తల ప్రసంగం ఉంటుందన్నారు. ఈకార్యక్రమని హిందూ బంధువులు అందరూ పాల్గొని విజయవంతం చేయలన్నారు. విశ్వహిందూ పరిషత్ నాయకులు వేముల సంతోష్ తదితర కులసంఘాల సోదరులు పాల్గొన్నారు.

# ఎస్పీ, ఎమ్మెల్యే రాక కోసం నాలుగు గంటల నిరీక్షణ... చివరికి నిరాశే!





**రాయికల్, ఏప్రిల్ 19 (జర్నలిస్ట్ ఫైల్) :** జగిత్యాల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాయికల్ పట్టణ కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద రాయికల్ ఎస్సై సుధీర్ రావు పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి వివిధ పాఠశాలల విద్యార్థులు ,పలు గ్రామాల సర్పంచులు, రాజకీయ నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు,మెప్మా ఆర్పీలు తదితరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండుటెండను సైతం లెక్కచేయకుండా టెంటు కింద కూర్చొని జిల్లా ఎస్పీతో పాటు జగిత్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే రాక కోసం అందరూ ఎదురుచూశారు. అయితే గంటల తరబడి నిరీక్షించినప్పటికీ వారు కార్యక్రమానికి హాజరు కాలేదు. చివరకు మధ్యాహ్నం రెండు గంటల సమయంలో సీఐ సుధాకర్ అక్కడికి చేరుకుని, అనివార్య కారణాల వల్ల కార్యక్రమాన్ని నిర్వహించలేక పోతున్నందుకు చింతిస్తున్నామని తెలిపారు. దీంతో ఉదయం నుంచి ఆశగా ఎదురుచూసిన ప్రజాప్రతినిధులు, మహిళా సిబ్బంది, విద్యార్థులు, నిరాశతో వెనుదిరిగారు. ప్రజల సమయానికి విలువ ఇవ్వకుండా ఇలా చివరి నిమిషంలో కార్యక్రమం రద్దు కావడం పట్ల హాజరైన వారు అసంతృప్తి వ్యక్తం చేశారు.

## జగిత్యాలలో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి



**జగిత్యాల, ఏప్రిల్ 19 (జర్నలిస్ట్ ఫైల్) :** జగిత్యాల జిల్లాలో పోస్ట్ ఆఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు చేయాలని శనివారం భోగ శ్రావణితో కలిసి నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అరవింద్ కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి శ్రీ కీర్తి వర్ధన్ సింగ్ ని ఢిల్లీలోని వారి కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా జగిత్యాల ప్రజల దీర్ఘకాలిక అవసరమైన ప్రత్యేక పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు పై వినతిపత్రం అందజేశారు. ఈ ప్రతిపాదనపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

## వీడలేమంటూ వీడ్కోలు.. భావోద్వేగంలో విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా వార్షికోత్సవం



**బెల్లంపల్లి (జర్నలిస్ట్ ఫైల్) :** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వార్షికోత్సవం, వీడ్కోలు మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి ఘనంగా ముగింపు పలికారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ మాట్లాడుతూ, విద్యార్థులు డిగ్రీ అనంతరం ఉన్నత విద్యను కొనసాగించాలని, ముఖ్యంగా పీజీ చదవాలని సూచించారు. అధ్యాపకులు విద్యార్థులకు అభినందనలు తెలుపుతూ శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థుల ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తృతీయ సంవత్సరం విద్యార్థులు కళాశాలను వీడుతున్న సందర్భంగా భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టిన దృశ్యాలు అందరినీ కదిలించాయి. డిగ్రీ ముగింపు జీవితంలో కొత్త ఆరంభమని అధ్యాపకులు వారికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మేడ తిరుపతి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పటాన్‌చెరు పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయ 18వ వార్షికోత్సవం మాద్రి పృథ్వీరాజ్ .



**జర్నలిస్ట్ ఫైల్ :**పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతి నగర్‌లో గల అయ్యప్పస్వామి దేవాలయం 18వ వార్షికోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, ఎం డి ఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాద్రి పృథ్వీరాజ్‌ని సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు సత్యనారాయణ గూడెం మధు సంజీవ్ రెడ్డి నర్రా భిక్షపతి ధనరాజ్ గౌడ్ గుండమొల్ల రాజు చందు శంకర్ గారు, అంజి నగేష్ తదితరులు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు మరియు ఎం డి ఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

## జాబితాలో తప్పులు లేకుండా చూడాలి

**– బి యల్ ఓ శిక్షణలో సబ్ కలెక్టర్ ఉమా హారతి**



నారాయణఖేడ్ ఏప్రిల్ 19 (జర్నలిస్ట్ ఫైల్) : జనగణన సందర్భంగా బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ తిరిగి ఓటరు జాబితాను తప్పులు లేకుండా, సమగ్రంగా పరిశీలించాలని నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఎస్. ఉమా హారతి అన్నారు. శుక్రవారం నారాయణఖేడ్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బూత్ స్థాయి అధికారుల శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ..ఒకే ఇంటిలో నివసించే కుటుంబ సభ్యుల పేర్లు ఓటారు జాబితాలో వేర్వేరు చోట కాకుండా ఒకే చోట ఉండేలా చూడడం జనగణన ముఖ్య ఉద్దేశం అన్నారు.ఇంటింటి సర్వేకు వెళ్ళినప్పుడు మరణించిన వారి పేర్లను తొలగించడం,కొత్త ఓటర్లను చేర్చడం చేయాలి అన్నారు.కుటుంబ సభ్యులందరినీ ఒకే చోట గ్రూప్ చేసి మ్యాపింగ్ చేయాలి అన్నారు.2026 నాటి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్ ) కు సంబంధించి మ్యాపింగ్, ఎనుమేరేషన్ మరియు అన్నెక్సుర్ తప్పకుండ నమోదు చేయాలి అన్నారు.మ్యాపింగ్ పూర్తయిన ఓటర్ల వివరాలను సేకరించడానికి అనెక్షర్ ను ఉపయోగించాలి అన్నారు.ఓటరు జాబితాలోని వివరాలు మరియు క్షేత్రస్థాయిలో ఉన్న ఓటర్ల వివరాలు సరిపోలితే వారిని అన్నెక్సుర్ 3 లో నమోదు చేయాలి అన్నారు.నెల రోజుల పాటు అత్యంత కీలకంగా ఇంటింటి తనిఖీ కార్యక్రమం నిర్వహించాలి అన్నారు.అనెక్షర్ 4 ఇది మ్యాపింగ్ కాని ఓటర్ల కోసం కేటాయించబడిందని,ఓటరు జాబితాలో పేరు ఉండి, క్షేత్రస్థాయిలో వారు మ్యాపింగ్ కాకపోతే (ఉదాహరణకు: ఇల్లు మారినవారు లేదా అందుబాటులో లేనివారు) వారి వివరాలను అన్నెక్సుర్ 4 ద్వారా సేకరించాలి అన్నారు.కొత్తగా ఓటరుగా నమోదు కావాల్సిన వారు లేదా అర్హత ఉండి జాబితాలో లేని వారి కోసం కూడా అన్నెక్సుర్ ను ఉపయోగించాలి అన్నారు.పకడ్బందీగా, పక్కాగా,ఎటువంటి పొరపాట్లు లేకుండా నెల రోజుల పాటు కార్యక్రమం కొనసాగించాలి అన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హసీనా బేగం,నాయబ్ తహసీల్దార్ రాజు పాటిల్,గిర్దావర్ మాధవరెడ్డి,శిక్షకులు భూమయ్య,నర్సింలు, బిఎల్ఓ లు,ఆయా పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## త్రాగునీటి కోసం రోడ్ ఎక్కిన తండా ప్రజలు

**– నెల రోజులుగా త్రాగడానికి మంచినీళ్లు రాక అవస్థలు పడుతున్న ప్రజలు**



నారాయణఖేడ్ ఏప్రిల్ 19 (జర్నలిస్ట్ ఫైల్) : ఖేడ్ నియోజకవర్గంసిర్గపూర్ మండలం జీవుల తాండలో గత నెల రోజులుగా త్రాగడానికి నిత్యవసరలకు మంచినీరు రాక తండా ప్రజలు తీవ్ర అవస్థలకు గురవుతున్నారని శనివారం రోడ్డుపైన ధర్నా నిర్వహించారు. జీవుల తండా ప్రజలు మాట్లాడుతూ...గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతిరోజు ప్రతి ఇంటికి త్రాగడానికి వాడుకోవడానికి మంచినీళ్లు పుష్కలంగా వచ్చేవని 24 గంటలు క్యాబ్ ఆన్ చేస్తే నీళ్లు మా వాకిట్లోకి వచ్చేవని తెలిపారు. కానీ ఇప్పుడు మాత్రం వేసవికాలంలో ఏర్పడడంతో తండాలో మంచినీళ్లు రాక చాలా ఇబ్బందులు పడుతున్నామని అన్నారు.గత నెల రోజుల నుండి ఒక్క చుక్క నీటిని కూడా విడుదల చేయలేదని చెప్పారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి వెంటనే స్పందించి మా తండాకు మంచినీరు అందించాలని వారు డిమాండ్ చేశారు.

## ఏళ్ల తరబడి నిర్మాణ దశలో ఉన్న రుక్కితండ గ్రామపంచాయతీ భవనం

**– పంచాయతీరాజ్ ఏఈ, కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలి – సర్పంచ్ రమాదేవి, మల్లి బాబు యాదవ్ – నిర్మాణ కార్యక్రమం చేపట్టాలని**



ఖమ్మం, కామేపల్లి, (జర్నలిస్ట్ ఫైల్) : పంచాయతీరాజ్ శాఖ అధికారులు కాంట్రాక్టర్ తో కుమ్మక్కై కామేపల్లి మండలం రుక్కి తండా గ్రామపంచాయతీ భవన నిర్మాణం బేస్ మెంట్ స్థాయిలో ఉన్నప్పటికీ బిల్లులు మంజూరు చేయడం జరిగిందని, గ్రామపంచాయతీ కార్యాలయ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్ పై అధికారులపై చర్యలు తీసుకోవాలని రుక్కి తండ గ్రామ ప్రజలు శనివారం కామేపల్లి ఎండిఓ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఎండిఓ వెంటనే స్పందించి కామేపల్లి మాజీ జెడ్పిటిసి మల్లి బాబు యాదవ్, సర్పంచ్ రమాదేవి మండల అధికారుల సమక్షంలో నాటి పంచాయతీరాజ్ ఏఈ కి ఫోన్ చేసి గ్రామ పంచాయతీ కార్యాలయం యొక్క పూర్తి వివరాలను, బిల్లుల మంజూరికి సంబంధించిన పత్రాలు గురించి అడగగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడని సమాచారం. ఈ విషయంలో అధికారులు వెంటనే జోక్యం చేసుకొని ఏళ్ల తరబడి బేస్ మెంట్ లెవల్ లో ఉన్న భవనాన్ని వెంటనే నిర్మాణం చేయాలని రుక్కి తండా సర్పంచ్ గుగులోతు రమాదేవి, మల్లి బాబు యాదవ్ అధికారులను కోరారు. గ్రామ పంచాయతీ భవనం లేక స్థానిక పాఠశాల భవనంలో సమావేశాలు చేసుకోవడం జరుగుతుందని, నిర్మాణం చేద్దామనుకుంటే స్థలదాత అడ్డం తిరుగుతూ, నాకు ఆరోజు భూమి పరిహారం కింద ఇస్తానని చెప్పి, ఏమి ఇవ్వలేదని, ఎలాంటి అగ్రిమెంటు చేయించుకోలేదని, ఆ స్థలంలో నేను ఇల్లు కట్టుకుంటానని చెబుతున్నాడని, స్థలదాత అగ్రిమెంట్ లేకుండా గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా, పంచాయతీ భవన నిర్మాణం ఎలా చేపట్టారని, బిల్లులు ఎలా మంజూరు చేశారని రుక్కితండా గ్రామ ప్రజలు ఎండిఓ ను నిలదీయడం జరిగింది. గత ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కొరకు తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి ప్రత్యేకంగా గ్రామ పంచాయతీ భవన నిర్మాణముల కొరకు 20 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయడం జరిగింది. కానీ అధికారులు కాంట్రాక్టర్ కుమ్మక్కై పనులు నిర్లక్ష్యం చేశారని ఉన్నతాధికారులు వీటిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పర్మిశెట్టి సాంబయ్య, గుగులోత్ కిషన్ కురసం రామ్మూర్తి, బానోత్ అశోక్ జాటోత్ సాయికుమార్, ఉబ్బని బాబు బానోతు దాన్యా నాయక్, లాకావత్ రాములు, కురసం రవి,



ముత్తబోయిన సత్యనారాయణ చిన్నబోయిన కృష్ణ, చిన్నబోయిన కుమార్, ఎఱ్ఱు సతీష్, బొమ్మగాని సుఖేందర్, కోట రాజా గుంట్ల వెంకటేష్, కొంకట్ల భద్రయ్య, గుగులోత్ రవి మేకల మల్లికార్జునరావు లాకావత్ నెహ్రూ, లాకావత్ నరేష్ బానోత్ దేవ్ సింగ్, మాలోత్ వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

# మన శరీరంలో కాలేయం అత్యంత కీలకమైన అవయవం

**బూర్గుల ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ కాలేయ దినోత్సవం**

**కాలేయ దినోత్సవం నిర్వహించిన రంగారెడ్డి జిల్లా వైద్యాధికారిని డాక్టర్ కే లలితాదేవి**



షాద్నగర్ నియోజకవర్గం ఏప్రిల్ 19 (జర్నలిస్ట్ ఫైల్) : మన శరీరంలో అత్యంత కీలకమైన అవయవాలలో కాలేయం (లివర్ )ఒకటని ఇది శరీరంలో అనేక ముఖ్యమైన జీవక్రియలకు కేంద్ర బిందువుగా పనిచేస్తుందని, మనం తీసుకునే ఆహారము నీరు ఔషధాలు వంటి అన్ని పదార్థాలను శుద్ధి చేయడంలో కాలేయం ప్రధాన పాత్ర పోషిస్తుందని, ఇది 500 పైగా ముఖ్యమైన విధులను నిర్వహిస్తుందని రంగారెడ్డి జిల్లా వైద్యాధికారిని డాక్టర్ కే లలితాదేవి అన్నారు.ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యమరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే లలితా దేవి ఫరూక్ నగర్ మండలం బూర్గుల ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ప్రపంచ కాలేయ దినోత్సవం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలేయానికి ప్రత్యేకంగా పునరుత్పత్తి సామర్థ్యం ఉన్నప్పటికీ నిర్లక్ష్యం వలన తీవ్రమైన నష్టం కలగవచ్చని, ముఖ్యంగా కాలేయం దెబ్బతిన్న ప్రారంభ దశలో లక్షణాలు కనిపించకపోవడం వల్ల దీనిని నిశ్శబ్దహంతకుడు అని పిలుస్తారని తెలిపారు. ప్రస్తుతం కాలేయ వ్యాధులు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్నాయని మద్యం సేవనం మాత్రమే కాకుండా అధిక కొవ్వు వున్న ఆహారము ,జంక్ ఫుడ్ , వ్యాయామం లేకపోవడం వంటి ఆధునిక జీవనశైలి కారణంగా "నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ " కేసులు కూడా ఘననీయంగా పెరుగుతున్నాయని ఈ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ కే లలితా దేవి తెలిపారు.

### మంచి అలవాట్లు....పటిష్టమైన కాలేయం

ప్రతిరోజు కనీసం 30 నుండి 45 నిమిషాలు వ్యాయామం చేయాలి , సమతుల్యమైన ఆహారం తీసుకోవాలి , జంక్ ఫుడ్ అధిక కొవ్వు పదార్థాలు , చక్కెర పానీయాలు తగ్గించాలి. మద్యపానం పూర్తిగా నివారించాలి , తగినంత నీరు తాగాలి , ఏడాదికి ఒకసారి కాలేయ పనితీరు పరీక్షలు చేయించుకోవాలి. హెపటైటిస్ బి వంటి వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి."మంచి అలవాట్లు -పటిష్టమైన కాలేయం"అని నినాదంతో ప్రతి ఒక్కరు ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలని డాక్టర్ కే లలితా దేవి పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన దేశ నిర్మాణంలో పౌరుల ఆరోగ్యమే కీలకమని, కాలేము మన శరీరంలోని నిశ్శబ్ద ఇంజన్ వంటిదని, అది ఎంత స్మూత్ గా రన్ అయితే, మన జీవితం అంతా కాలం సాఫీగా సాగుతుందని, ప్రపంచ కాలేయ దినోత్సవ సందర్భంగా చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, క్రమం తప్పకుండా శారీరక తమ చేస్తూ మన కాలేయాన్ని కాపాడుకుందాం అని ప్రతిజ్ఞ చేద్దాం. కాలేయ రక్షణ జీవన రక్ష అని గుర్తిద్దామని రంగారెడ్డి జిల్లా డాక్టర్ కే లలితా దేవి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా ఆఫీసర్ కె శ్రీనివాసులు, బూర్గుల వైద్యాధికారి డాక్టర్ రఘురాం, డాక్టర్ జయప్రకాష్, ల్యాబ్ టెక్నీషియన్ వెంకటరమణి స్టాఫ్ నర్స్ సునీత ఫార్మసిస్ట్ రాజశ్రీ, హెల్త్ అసిస్టెంట్ రెడ్డి నాయక్ ఏసి సిబ్బంది పాల్గొన్నారు.

# మున్నూరుకాపుల జనాభాను తగ్గించడం, రాజకీయంగా, సామాజికంగా అణచివేసే కుట్రే

**– ఈ తీరును తీవ్రంగా ఖండించిన మున్నూరు కాపు ఎంపీలు, సీనియర్ నేతలు, ప్రముఖులు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మున్నూరుకాపు కుల గణన పూర్తి తప్పుల తడక అని ఆగ్రహం**

**– కుల జనాభాను తగ్గించిన కుట్రలపై మున్నూరు కాపులు పోరాడాలని పిలుపు**

**– కోకాపేటలో భవన నిర్మాణాన్ని వేగవంతం చేద్దాం, మున్నూరు కాపుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకుందామని నిర్ణయం**



న్యూఢిల్లీ, ఏప్రిల్ 19 (జర్నలిస్ట్ ఫైల్) : మున్నూరు కాపులను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అణచివేసేందుకు ప్రభుత్వ స్థాయిలోనే కుట్రలు ప్రారంభమయ్యాయని, వీటిని తక్షణమే తిప్పికొట్టకపోతే కుల సమాజ ఉనికికే ప్రమాదం అని అన్ని పార్టీల మున్నూరుకాపు నేతలు స్పష్టం చేశారు.తమ హక్కులను కాపాడుకునేందుకు, తమ మీద జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కొనేందుకు,పార్టీలు భావజాలాలకు అతీతంగా, తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు సమాజమంతా ఐక్యం కావలసిన అత్యవసర పరిస్థితి తలెత్తిందని, రాజకీయంగా, సామాజికంగా అణచివేయడానికి, ఆధిపత్య పాలక వర్గాలనుండి, మున్నూరుకాపుల మీద జరుగుతున్న ఉద్దేశపూర్వక దాడులను, వివక్షపూరిత ధోరణులను తీవ్రంగా తిప్పికొట్టాల్సిన సమయం ఆసన్నమైందని కుల పెద్దలు స్పష్టం చేశారు. ఈ మేరకు బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యులు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే.లక్ష్మణ్ పటేల్,కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పటేల్,బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్,రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పటేల్ , పీసీసీ మాజీ అధ్యక్షులు, రాజ్యసభ మాజీ సభ్యులు వీ. హనుమంత రావు పటేల్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు టీపీసీసీ ఉపాధ్యక్షులు గాలి అనిల్ కుమార్ పటేల్ తదితర ప్రముఖులతో మున్నూరు కాపు ఫౌండేషన్ ట్రస్ట్ బాధ్యులు సమావేశమయ్యారు.కాగా,గత ప్రభుత్వం మున్నూరుకాపు ఆత్మగౌరవ భవన నిర్మాణం కోసం కోకాపేటలో 5, ఎకరాల భూమి కేటాయించిన విషయం తెలిసిందే. మున్నూరుకాపు ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ స్థలంలో ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఆర్థిక వనరులు తదితర సమన్వయలోపాల కారణంగా పనులు ఆలస్యమ వుతున్న నేపథ్యంలో భవన నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు ఫౌండేషన్ ట్రస్ట్ బాధ్యుల ఆధ్వర్యంలో రెండు రోజుల ఢిల్లీ పర్యటన జరిగింది.ఈ సందర్భంగా మున్నూరుకాపు ఆత్మగౌరవ భవన నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయడంతో పాటు, కులం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం గురించి సవివరంగా చర్చించారు.త్వరలో కుల పెద్దలు శ్రేయోభిలాషులు, దాతలు తదితరులతో సమావేశమై భవన నిర్మాణం పనులను వేగవంతం చేయాలని నిర్ణయించారు. అందుకోసం అవసరమయ్యే, వనరుల సమీకరణ సహా అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టమైన హామీ ఇచ్చారని ఫౌండేషన్ ట్రస్ట్ బాధ్యులు ప్రకటించారు.అదే సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం విడుదలచేసిన కుల జనాభాలో మున్నూరు కాపుల సంఖ్యను అత్యంత తక్కువ చేసి చూపించడం దారుణమని సమావేశం ఆగ్రహం వ్యక్తం చేసింది.మున్నూరు కాపుల జనాభా సంఖ్యను తగ్గించి చూపడం యాదృచ్ఛికంగా జరిగింది కాదని, మున్నూరు కాపులను సామాజికంగా, రాజకీయంగా అణగదొక్కడానికే కుట్ర పూరితంగా జరిగిన పరిణామమని.. చర్చ సందర్భంగా కుల పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేశారు.కనీస అవగాహన, పరిజ్ఞానం లేకుండా, వాస్తవాలను గ్రహించకుండా,పరిగణలోకి తీసుకోకుండా మున్నూరు కాపుల సంఖ్యను తగ్గించి మూడు శాతంగా చూపించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఖండించారు.ఇందుకు సంబంధించి తక్షణమే కార్యాచరణ ప్రణాళికను రూపొందించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్నూరుకాపు సమాజాన్ని ఐక్యం చేసి హక్కులను కాపాడుకునే దిశగా పోరాటాలకు పిలుపునివ్వాలని నిర్ణయించారు.

హైదరాబాద్ లో సమావేశమై ఇందుకు సంబంధించిన కార్యాచరణను ప్రకటించనున్నట్లు మున్నూరు కాపు సంఘం, ట్రస్ట్ ఫౌండేషన్ స్పష్టం చేసింది.రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో మున్నూరుకాపు ఫౌండేషన్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రౌతు కనకయ్య పటేల్, సభ్యులు మంగళారపు లక్ష్మణ్ పటేల్,పన్నాల విష్ణువర్ధన్ పటేల్,రమేష్ హజారి పటేల్, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తం రావు పటేల్,నాయకులు ఇసంపల్లి వెంకన్న పటేల్, కాశెట్టి కుమార్ పటేల్ ఆవుల రామారావు పటేల్,వెంగళ రమేష్,ప్రముఖ మ్యూజిషియన్ సామల వేణు,మహిళా నేతలు కొణతం దీపిక, ఆకుల శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.

## తమిళనాడు సాదారణ ఎన్నికల బందోబస్తు విధులకు హాజరౌతున్న హోమ్ గార్డ్ సిబ్బందికి మెడికల్ మరియు కనీస అవసరాల కిట్లు పంపిణీ

**విధుల్లో ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి, సంగారెడ్డి జిల్లా కు మంచి పేరు తీసురావాలి : జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్,**



సంగారెడ్డి జిల్లా ఏప్రిల్ 19 (జర్నలిస్ట్ ఫైల్) : తమిళనాడు రాష్ట్రంలో జరుగనున్న సాదారణ ఎన్నికల నేపథ్యంలో బందోబస్తు విధులకు సంగారెడ్డి జిల్లా నుండి వెళుతున్న 38 మంది హోమ్ గార్డ్ సిబ్బందికి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మెడికల్ మరియు కనీస అవసరాల కిట్లను అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఎన్నికల విధులు అత్యంత బాధ్యతాయుతమైనవని, సిబ్బంది తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. దూర ప్రాంతాలలో విధులు నిర్వహించేందు వెళుతున్న సిబ్బంది బాగోగులను దృష్టిలో ఉంచుకొని, అవసరమైన ప్రాథమిక ఔషధాలు, బిస్కెట్స్, వ్యక్తిగత అవసరాల సామగ్రి అందుబాటులో ఉండేలా ఈ కిట్లు అందజేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. అలాగే విధుల్లో అప్రమత్తంగా ఉండి, ఎలాంటి పరిస్థితులనైనా సమర్థంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి, సంగారెడ్డి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఆరోగ్య పరంగా ఎలాంటి సమస్యలున్న నేరుగా సంగారెడ్డి జిల్లా పోలీసు డ్యూటీ డాక్టర్ కు కాల్ చేసి, మెడిసిన్స్ వివరాలను తెలుకోవచ్చు అన్నారు. విధి నిర్వహణలో లేదా వ్యక్తిగత సమస్యలున్నా సంబంధిత అధికారుల ద్వారా నా దృష్టికి తీసుకురాలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎ.ఆర్ డిఎస్పీ నరేందర్, పోలీసు డ్యూటీ డాక్టర్ జ్యోతి, డానియెల్ ఆర్ఐ హోమ్ గార్డ్స్, ఆర్ఐ లు సురేష్ నాయక్, రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రావ్, బందోబస్తు విధులకు వెళుతున్న ఆర్.ఎస్ఐ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ అర్డిఓ వెంకట్ రెడ్డికి నెలరోజుల జైలు శిక్ష 2000 జరిమానా



రాజేంద్రనగర్, ఏప్రిల్ 19 (జర్నలిస్ట్ ఫైల్) : రాజేంద్రనగర్ అర్ డిఓ వెంకట్ రెడ్డికి కోర్టు ధిక్కరణ కింద నెల రోజుల జైలు,రూ.2వేల జరిమానా విధించింది.పెద్ద షాపూర్లోని 74 ఎకరాల భూ వివాదంలో ఉత్తర్వులు జారీ చేయడంలేదని యూసుఫుద్దీన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.విచారణ జరిపిన కోర్టు..సూచించిన టైమ్కి ఉత్తర్వులు జారీ చేయలేదని తీర్పునిచ్చింది.జరిమానా చెల్లించకుంటే 2వారాలు శిక్ష పొడిగించాలంది.అప్పీల్కు వీలుగా తీర్పు అమలును 2వారాలు నిలిపేసింది.

## "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" లో భాగంగా "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత ప్రత్యేక కార్యక్రమాలు



ఏప్రిల్ 13 నుండి 18 వరకు 6 రోజుల పాటు గ్రామాలలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు మునిపల్లి ఏప్రిల్ 19 (జర్నలిస్ట్ ఫైల్) : పటేల్ ఫంక్షన్ హాల్ బుదేరా నందు సంగారెడ్డి డి.ఎస్.పి సత్తయ్య ఆధ్వర్యంలో శనివారం నాడు మండలంలోని అన్ని గ్రామాల యువకులకు హెల్మెట్లు పంపిణీ చేయనైనది. ప్రతి ఒక్కరూ హెల్మెట్లు ధరించాలని యువకులకు డిఎస్పి సూచించారు, రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించినారు. అనంతరం హెల్మెట్ ధరించాలంటూ అవగాహన కల్పిస్తూ పటేల్ ఫంక్షన్ హాల్ నుండి బుదేరా ఎక్స్ రోడ్ మీదుగా పెద్ద గోపులారం వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఇట్టి హెల్మెట్లను అల్లాపూర్ సర్పంచ్ నారాయణ సహకారంతో వివిధ



గ్రామాల చెందిన ద్విచక్ర వాహనదారులకు అందజేశారు ఇట్టి కార్యక్రమంలో కొండాపూర్ సీఐ సుమన్ కుమార్, మునిపల్లి ఎస్సై ఎం రాజేష్ నాయక్, వివిధ గ్రామాల సర్పంచులు, యువకులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో 100వ వారం అన్నదానం కార్యక్రమం లో పాలుగోన్నా దేశ్ పాండే



సంగారెడ్డి ఏప్రిల్ 19 (జర్నలిస్ట్ ఫైల్) : సంగారెడ్డి జిల్లా పట్టణం లో బిజెపి సంగారెడ్డి పట్టణ కోశాధికారి కైలా సందీప్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పేద ప్రజలకు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి 100వ వారం అన్నదానం పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వర్ రావ్ దేశ్ పాండేఈ కార్యక్రమం లో మాజీ కౌన్సిలర్ మందుల నాగరాజు కనని వాసు దోమల విజయ్ కుమార్ శ్రీనివాస్ రెడ్డి తులసి రెడ్డి సంతోష్ శ్రీకాంత్ క్రాంతి కులకర్ణి నరేష్ గౌడ్ విజయ్ తదితరులు పాల్గొన్నారు....

## కాంట్రాక్ట్ వైద్య సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



○ చిల్లపల్లికి వినతి పత్రం అందజేసిన అసోసియేషన్ ప్రతినిధులు

మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్): వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో సేవలందిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్‌లు, ఫార్మసిస్టులు, స్టాఫ్ నర్సులు తదితర పారామెడికల్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కాంట్రాక్ట్ ల్యాబ్ టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (అమరావతి) ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. ఆదివారం ఉదయం మంగళగిరి--తెనాలి ఫ్లైఓవర్ సమీపంలోని జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ కార్యాలయంలో ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్, జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావును అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శి తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కాంట్రాక్ట్ సిబ్బంది ఎదుర్కొంటున్న జీతభత్యాలు, ఆరోగ్య భద్రత, ఉద్యోగ స్థిరీకరణ (రెగ్యులరైజేషన్) వంటి ప్రధాన సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, వైద్య ఆరోగ్య రంగంలో సేవలందిస్తున్న సిబ్బంది సమాజ శ్రేయస్సుకు కీలకమని పేర్కొన్నారు. వారి సేవలకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. సిబ్బంది సమస్యలను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి మరియు సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సిబ్బంది సమస్యలు త్వరలోనే పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేసిన ఆయన, ప్రజా ఆరోగ్య సేవల్లో సిబ్బంది మరింత చురుగ్గా పాల్గొనాలని కోరారు.

## అసాంఘీక కార్యకలాపాల కేసులో.. ముగ్గురు అరెస్ట్



○ డిఎస్పీ. బి. జనార్ధనరావు

తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): ఆన్ లైన్ అసాంఘిక కార్యకలాపాల కేసులో ఇద్దరుమహిళలను ,ఓవ్యక్తినీ,అరెస్ట్ చేసి వారివద్ద ఒక ల్యాప్టాప్, ఒక మొబైల్ స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పీ బి. జనార్ధనరావు పేర్కొన్నారు.

పట్టణంలో ఆన్లైన్ ద్వారా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో 3టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల16న కీలక ఆపరేషన్ నిర్వహించి పోలీసులు ఇద్దరు మహిళలను, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. కేసు పుర్వపరాలను ఆదివారం త్రీటౌన్ పోలీస్ స్టేషన్ లొ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలొ డిఎస్పీ బి. జనార్ధనరావు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని పాండురంగ పేటలొ, ఓ ఇల్లు అద్దెకు తీసుకుని ఆన్ లైన్ ద్వారా అసాంఘీక కార్యకలాపాలు సాగిస్తున్నట్లు, లభించిన సమాచారం మేరకు, పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, త్రీ టౌన్ సి ఐ సాంబశివరావు ఆద్వర్యంలో, ఎస్సైలు, సిబ్బంది, సోదాలు నిర్వహించి,ముగ్గురుని అదుపులోకి తీసుకుని విచారిచారని తెలిపారు.

నిందితులు పేర్లు అనురాధ, షెహనాజ్ హేమంత్ సాయి అని,పట్టణంలోని, పాండురంగపేటలో ఒక నివాసంలో ఆన్లైన్ ద్వారా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు విచారణలొ తేలిందన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఈ కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు నిందితులు తెలిపారని,వారి నుంచి ఒక ల్యాప్టాప్, ఒక మొబైల్ స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టణంలో జరుగుతున్న ప్రచారానికి భిన్నంగా, వ్యవహారం నడుస్తుంధని, వివరించారు. ఇంటర్నేషనల్ యాప్, ఆన్ లైన్ లైవ్ స్ట్రీమింగ్ ప్లాట్ఫామ్,ఇందులో యూజర్లు తమ వీడియోలను లైవ్ గా ప్రసారం చేస్తారని,. వీక్షకులు టోకెన్లు, చెల్లించి, ప్రసారకర్తల నుండి వివిధ రకాల ప్రదర్శనలు కోరుతారు. ఈ టోకెన్లు తర్వాత డబ్బుగా మారుతాయన్నారు. ప్రజలకుఆన్లైన్ వేదికలను దుర్వినియోగం చేయడం చట్టరీత్యా నేరం. ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండి, అనుమానాస్పద సమాచారం ఉంటే సమీప పోలీస్ స్టేషన్కు తెలియజేయాలని,. కుటుంబ సభ్యులు, యువత ఆన్లైన్ వినియోగంపై జాగ్రత్తగా ఉండాలనిసూచించారు. మీడియా సమావేశంలొ త్రీ టౌన్ సిబ్బంది ఉన్నారు.

## ఏ దేశంలో స్త్రీలు ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందుతారో ఆ దేశం అభివృద్ధి దేశంగా నిలుస్తుంది

○ మహిళా బిల్లు వ్యతిరేకులు, భారత వికాసానికి వ్యతిరేకులు

○ మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న ప్రతిపక్షాలు చరిత్రహీనులు - ఎమ్మెల్యే గళ్ళా మాధవి తీవ్ర విమర్శలు

○ మహిళా సాధికారతకు అడ్డంకులు సృష్టించే శక్తులను మహిళలే తిప్పికొట్టాలని గళ్ళా మాధవి పిలుపు



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ) : ఏ దేశంలో స్త్రీలు ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందుతారో, ఆ దేశం అభివృద్ధి చెందిన దేశంగా నిలుస్తుందని, మహిళా బిల్లు వ్యతిరేకులు, భారత వికాసానికి వ్యతిరేకులు అని, పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న ప్రతిపక్ష పార్టీలు చరిత్రలో చరిత్రహీనులుగా మిగిలిపోతాయని, మహిళా సాధికారతకు అడ్డంకులు సృష్టించే శక్తులను మహిళలే తిప్పికొట్టాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తీవ్రంగా పిలుపునిచ్చారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లుపై దేశవ్యాప్తంగా మహిళలు ఎంతో ఆశతో ఎదురు చూశారని, ఇది ఒక్కరోజు కల కాదు, దాదాపు మూడు దశాబ్దాలుగా మహిళలు ఎదురుచూస్తున్న చారిత్రాత్మక అవకాశం అని గుర్తు చేశారు. అయితే, సరైన కారణాలు లేకుండా కేవలం రాజకీయ ఎజెండాతో ప్రతిపక్షాలు ఈ బిల్లును వ్యతిరేకించడం దురదృష్టకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టడమే కారణంగా వ్యతిరేకించడం తప్పు, ప్రతిపక్షాల వద్ద స్పష్టమైన అభిప్రాయం లేదని విమర్శించారు. 33% బదులు 50% కావాలని, డిలిమిటేషన్ వల్ల దక్షిణ భారతానికి అన్యాయం జరుగుతుందని అపోహలు సృష్టించడం ప్రజలను తప్పుదారి పట్టించడం మాత్రమేనని అన్నారు. ఈ అంశాలపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన వివరణ ఇచ్చినా ప్రతిపక్షాలు పట్టించుకోలేదని తెలిపారు. మహిళలు జనాభాలో సగం ఉన్నప్పటికీ, రాజకీయాల్లో వారి ప్రాతినిధ్యం తక్కువగా ఉందని గళ్ళా మాధవి పేర్కొన్నారు. మహిళల సమస్యలు మహిళల ద్వారానే ప్రతిఫలించాలంటే, రాజకీయాల్లో వారి భాగస్వామ్యం తప్పనిసరి అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. మహిళల సూచనలు, ఆలోచనల ఆధారంగా పాలసీలు రూపుదిద్దుకుంటేనే నిజమైన సాధికారత సాధ్యమవుతుందని వివరించారు. పార్లమెంట్‌లో ఈ బిల్లును వ్యతిరేకిస్తూ కొందరు మహిళా నేతలు ఆనందం వ్యక్తం చేయడం చూసి బాధ కలిగిందని, “ఒక మహిళ మరో మహిళకు మద్దతు ఇవ్వకపోవడం బాధాకరం” అని అన్నారు. ఇది మహిళల పట్ల చేసిన ద్రోహమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి వ్యాఖ్యానించారు. అమరావతి అభివృద్ధిని గతంలో ఎలా అడ్డుకున్నారో, అదే విధంగా ఇప్పుడు దేశవ్యాప్తంగా మహిళల పురోగతికి ఉపయోగపడే బిల్లును అడ్డుకోవడం కూడా అదే దృక్పథమని గళ్ళా మాధవి పోల్చిచూపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని, ఆ పురోగతికి అడ్డంకులు సృష్టించే నాయకత్వం దేశానికి మేలు చేయదని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో మహిళల ముందు ప్రతిపక్షాలు ఏ ముఖంతో వెళ్తాయో ప్రజలే నిర్ణయిస్తారని, మహిళల పట్ల నిజమైన నిబద్ధత ఏ పార్టీకి ఉందో ప్రజలకు స్పష్టమవుతోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

## పోరాటయోధులు సర్దార్ గౌతు లచ్చన్న : ఎమ్మెల్యే నసీర్

○ ఆయన మార్గం అందరికీ అనుసరణీయం

○ గౌతు లచ్చన్నకు నివాళులర్పించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ) : స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఆదివారం సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి సందర్భంగా స్థానిక బస్టాండ్ ఎదురుగా గల ఆయన విగ్రహానికి, స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ప్రజాహితసేవకుడు అయిన సర్దార్ గౌతు లచ్చన్న సాధారణ కుటుంబంలో జన్మించారని తెలిపారు. చిన్ననాటి నుంచే ఆయనలో దేశభక్తి, సామాజిక చైతన్యం బలంగా ఉండేదని, మహాత్మా గాంధీ ఆలోచనలతో ప్రేరణ పొందిన స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని చెప్పారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో ఆయన అనేక సార్లు జైలు శిక్ష అనుభవించారని, అయినప్పటికీ దేశ సేవకే తన జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. అందుకే గౌతు లచ్చన్నను “సర్దార్”అని పిలిచేవారని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత గౌతు లచ్చన్న గారు ప్రజల సేవను కొనసాగించారన్నారు. రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ఆయన ఎన్నో ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. రైతు సంక్షేమం కోసం గౌతు లచ్చన్న చేసిన కృషి అపారమైనదని అన్నారు. రాజకీయ రంగంలోనూ గౌతు లచ్చన్న కీలక పాత్ర పోషించారని, ప్రజల సమస్యలను ప్రభుత్వానికి చేరవేసి, పరిష్కారాల కోసం పోరాడారని వివరించారు. నిజాయితీ, నిబద్ధత, పారదర్శకత ఆయన నాయకత్వ లక్షణాలని తెలిపారు. లచ్చన్న జీవితం గొప్ప పాఠం నేర్పుతుందని, ధైర్యం, పట్టుదల, నిబద్ధత ఉంటే మనం ఎంత పెద్ద లక్ష్యాన్నైనా సాధించగలమని చెప్పారు. ప్రతి ఒక్కరూ సర్దార్ గౌతు లచ్చన్న సేవలను స్మరించుకుంటూ, ఆయన చూపించిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలి: ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ) : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం వినుకొండ నియోజకవర్గంలో భారీ ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకల షెడ్యూల్‌ను విడుదల చేస్తూ, ఉదయం 8 గంటలకు దేవాలయాల్లో సర్వమత ప్రార్థనలతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అనంతరం 9 గంటలకు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ, 9:30 గంటలకు చీఫ్ విప్ కార్యాలయంలో కేక్ కటింగ్, ఉదయం 9:30 గంటలకు మానవతా దృక్పథంతో అవయవ దాన శిబిరం, 10 గంటలకు పేదలకు తోపుడు బండ్ల పంపిణీ ఉంటుందని వివరించారు. ఉదయం 11 గంటలకు ఆర్టీసీ బస్టాండ్ వద్ద టీఎన్టీయూసీ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ వేడుకలు, 11:45 గంటలకు అన్నా క్యాంటీన్ విజిట్ నిర్వహించనున్నారు. , సాయంత్రం 6 గంటలకు యువతతో ప్రత్యేకంగా యూత్ మీటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సేవా కార్యక్రమాల్లో అభిమానులు, పార్టీ శ్రేణులు మరియు కార్యకర్తలు భారీగా తరలివచ్చి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు.

## త్రికాలజ్ఞులు వీరబ్రహ్మేంద్రస్వామి: ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ) : శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి అభ్యుదయ భావాలు, మానవత్వ విలువలతో కూడిన సమతా వాది అని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి వ్యాఖ్యానించారు. కాలజ్ఞానం తెలిసిన కుల, మత రహితులని తెలిపారు. కులాల కుళ్ళును, మతాల మత్తును ఆనాడే కడిగిపారేసిన త్రికాలజ్ఞులన్నారు. అంటరానితనాన్ని వ్యతిరేకించి సమతా వాదం లేవనెత్తిన సర్వజ్ఞులని ప్రస్తుతించారు.

ఐపీడీ కాలనీలోని బ్రహ్మం గారి గుడిలో శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, ఓంకారేశ్వర స్వామి వార్ల విగ్రహ పునః ప్రతిష్టా కార్యక్రమం ఈనెల 23వ తేదీన జరుగనుంది. ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణకు గాను వైసీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి సున్నం మల్లిఖార్జునరావు పది క్వింటాళ్ల బియ్యాన్ని అందజేశారు. బియ్యం బస్తాలతో బయలుదేరిన ఆటోకు ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పచ్చ జెండా ఊపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, భవిష్యత్తులో జరగబోయే అనేక విషయాలు ముందుగానే దర్శించి తాళపత్ర గ్రంథాలలో రచించి భద్రపరచిన మహా జ్ఞాని వీర బ్రహ్మేంద్ర స్వామి అని పేర్కొన్నారు. ఆయన రాసినవి కాలజ్ఞానంగా విశ్వ వ్యాప్తమైన వాస్తవం అందరికీ తెలిసిందేనని అన్నారు. ప్రస్తుత కాలంలో జరిగే అనేక విషయాలను ఆయన చెప్పిన కాలజ్ఞానానికి సమన్వయించుకుంటూ, “ఎపుడో చెప్పెను బ్రహ్మంగారు” అని అనేకులు అనేక సందర్భాలలో అనడం.. వినడం.. మనకు పరిపాటేనని ఆయన వివరించారు. అంతటి మహిమాన్వితులైన వీరబ్రహ్మేంద్రస్వామి వారి విగ్రహ పునః ప్రతిష్టా కార్యక్రమానికి బియ్యాన్ని వితరణగా అందజేసిన సున్నం మల్లిఖార్జునరావు ధార్మిక దాతృత్వాన్ని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ బత్తుల దేవానంద్, కుందుర్తి గురవాచారి, మేడూరి శివరామకృష్ణ, కందెపి భాస్కరరావు, యలమర్తి ధర్మారావు, దాసు రామకృష్ణాచారి, సంకూరి రాజారావు, ఓర్సు ప్రేమ్‌రాజు, మాజీ కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), షేక్ రోషన్, దూపాటి వంశీ, నూనె ఉమామహేశ్వరరెడ్డి, పానుగంటి చైతన్య, సత్యనారాయణ రెడ్డి, సంజీవరెడ్డి, రెడ్డి కోటేశ్వరరావు, మన్నేపల్లి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## తెనాలికి గర్వకారణం ఆస్ట్రో జమాలజిస్ట్ మాలిక్ : న్యాయవాది గౌరీశంకర్



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): పట్టణానికి చెందిన యువ క్రికెట్ అకాడమి వ్యవస్థాపకులు షేక్ కరిముల్లా మాలిక్, ఉత్తమ జమాలజిస్ట్ గా ఇటీవల డిల్లీలొ ఇంటర్నేషనల్ అవార్డు అందుకోవడం తెనాలికి గర్వకారణమని న్యాయవాది హరిదాసు గౌరీశంకర్ పేర్కొన్నారు. స్థానిక ప్రిన్స్ హోటల్ ప్రాంగణంలొ ఆదివారం, యంగ్ జనరేషన్ టీం, యువక్రికెట్ అకాడమీ మిత్రుల ఆధ్వర్యంలొ, ఆస్ట్రో జమాలజిస్ట్ షేక్ కరిముల్లా మాలిక్ ఇంటర్నేషనల్ అవార్డు అందుకున్న సందర్భంగా, ఘనంగా అభినందన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ పవనీప్రియాంక, వివేక ప్రిన్సిపాల్ సునీల్, యంగ్ జనరేషన్ టీం, సాధిక్, న్యాయవాది హరిదాసు గౌరీశంకర్ మిత్రమండలి, మాలిక్ ను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఎంచుకున్న రంగంలొ మరెన్నో అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.

## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలి



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు ఆదివారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. ? శస్త్రచికిత్స అనంతరం పవన్ కళ్యాణ్ విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో, ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం, ముఖ్యంగా అణగారిన వర్గాల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ధీశాలి పవన్ కళ్యాణ్ . ఆయన ఈ శస్త్రచికిత్స నుండి అత్యంత వేగంగా కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాక్షేత్రంలోకి రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. రాష్ట్ర అభివృద్ధిలో పవన్ కళ్యాణ్ పాత్ర కీలకమని, ఆయన రెట్టింపు ఉత్సాహంతో మళ్ళీ తన విధుల్లో పాలుపంచుకోవాలని కోరుకుంటూ, చిలకలపూడి పాపారావు తన సంఘీభావాన్ని తెలియజేశారు.

## చేతివృత్తుల పరిరక్షణకు ప్రత్యేక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలి

○ చేతివృత్తులకు ఆధునిక టెక్నాలజీ జోడించాలి

○ సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): సంప్రదాయ చేతివృత్తులు ఆధునిక పారిశ్రామిక యుగ ప్రభావంతో క్రమంగా అంతరించిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, వాటి పరిరక్షణకు ప్రత్యేక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక మంత్రిత్వ శాఖలు, సమగ్ర కమిషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాలను కోరారు. తక్షణ చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఆదివారం మంగళగిరి పట్టణంలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి చేతివృత్తిదారుల రెండు రోజుల వర్క్‌షాప్‌ను ముప్పాళ్ల నాగేశ్వరరావు ప్రారంభించారు. చేతివృత్తిదారుల జెండాను గీత పనివార్ల సంఘం రాష్ట్ర నాయకుడు కంచర్ల కాశయ్య ఆవిష్కరించగా, కార్యక్రమానికి చేతివృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జింక చలపతి అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న చేతివృత్తులు నేడు జీవనోపాధి సంక్షోభంలోకి నెట్టబడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు దశాబ్దాలుగా మాటల్లో ఆసక్తి చూపుతున్నప్పటికీ ఆచరణలో సమర్థవంతమైన విధానాలు అమలు చేయడంలో విఫలమవుతున్నాయని విమర్శించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో చేతివృత్తిదారులకు అవసరమైన నైపుణ్యాలు అందించేందుకు ప్రత్యేక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని సూచించారు. సంప్రదాయ వృత్తులతో పాటు ఆధునిక టెక్నాలజీ శిక్షణ కలిపి అందించాల్సిన అవసరం ఉందన్నారు.

చేతివృత్తులను కేవలం జీవనోపాధిగా కాకుండా స్థిరమైన పరిశ్రమలుగా అభివృద్ధి చేయాలని, మార్కెట్ సదుపాయాలు, ఆర్థిక సహాయం లేకపోవడం వల్ల వృత్తిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చేతివృత్తుల సమస్యలను శాస్త్రీయంగా అధ్యయనం చేసి పరిష్కార మార్గాలు సూచించేందుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. దశాబ్దాలుగా రాజకీయ పార్టీలు హామీలకే పరిమితమవుతున్నాయని ఆరోపించారు.

విశ్వకర్మ యోజన పథకం అమలుపై కూడా సందేహాలు వ్యక్తం చేస్తూ, పథకాలు క్షేత్రస్థాయిలో ఫలితాలు ఇవ్వడం లేదని విమర్శించారు. అమరావతి, పోలవరం వంటి ప్రాజెక్టుల పురోగతిపై కూడా ప్రశ్నలు లేవనెత్తారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై స్పందిస్తూ, నిజమైన సాధికారత కోసం పారదర్శక విధానాలు అవసరమని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామాంజనేయులు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి సుమారు 30 రకాల చేతివృత్తిదారుల ప్రతినిధులు వర్క్‌షాప్‌లో పాల్గొన్నారని తెలిపారు. చేనేత, స్వర్ణకారులు, గొర్రెల-మేకల పెంకుదారులు, రజకులు, నాయి బ్రాహ్మణులు, వాయిద్య కళాకారులు, కుమ్మరి, వడ్రంగి, మేదర, చర్మకారులు తదితర సంప్రదాయ వృత్తులు యంత్ర ఆధారిత ఉత్పత్తుల ప్రభావంతో తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునిక పరికరాలు కొనుగోలు చేయడానికి ఆర్థిక వనరులు లేకపోవడంతో అనేక మంది తమ వృత్తులను వదిలి ఇతర ఉపాధి వైపు మళ్లాల్సి వస్తోందని తెలిపారు.

ప్రస్తుత ప్రభుత్వంలో 62 కులవృత్తుల కార్పొరేషన్లు, గత ప్రభుత్వంలో 52 కార్పొరేషన్లు ఏర్పాటు చేసినప్పటికీ నిధుల కొరత కారణంగా ఆశించిన ఫలితాలు రాలేదని విమర్శించారు. ఫలితంగా చేతివృత్తిదారుల జీవన ప్రమాణాల్లో గణనీయమైన మార్పు కనిపించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన కూడా సాధారణ వృత్తిదారులకు పూర్తిస్థాయిలో ఉపయోగపడడం లేదని తెలిపారు.

ఈ వర్క్‌షాప్‌లో ప్రస్తుత పరిస్థితులపై సమగ్ర చర్చ జరిపి భవిష్యత్ కార్యాచరణ రూపొందించడమే లక్ష్యమని, ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చి స్థిరమైన నిధుల కేటాయింపు, ప్రత్యేక విధానాలు అమలు చేయించేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

వై.బి.వి. మహదేవ్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విశ్వకర్మ యోజన నిజమైన చేతివృత్తిదారులకు అందుబాటులో లేదని విమర్శించారు. పెద్ద కార్పొరేట్ సంస్థలకు ప్రాధాన్యం ఇస్తూ వృత్తిదారులను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగ సమస్యకు సాంకేతిక రంగం ఒక్కటే పరిష్కారం కాదని, సంప్రదాయ వృత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, విశాఖ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ జె.వి. సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ, సంప్రదాయ వృత్తుల్లో ధనవంతులు ప్రవేశించడం వల్ల వృత్తిదారుల ఉపాధి దెబ్బతింటోందని పేర్కొన్నారు. చేతివృత్తిదారులు ఐక్యంగా పోరాడితేనే సమస్యలకు పరిష్కారం సాధ్యమని అన్నారు.

కార్యక్రమంలో చేతివృత్తిదారుల సంఘం గౌరవ అధ్యక్షుడు సి. లింగమయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి, ప్రొఫెసర్ ఎన్. అంజయ్య, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# పవన్ కల్యాణ్ ఆరోగ్యంపై ప్రధాని మోదీ ఆరా

**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక శ్రద్ధ చూపించారు. అస్వస్థత కారణంగా శస్త్రచికిత్స అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పవన్ కల్యాణ్‌కు ప్రధాని నేరుగా ఫోన్ చేసి పరామర్శించారు. పవన్ కల్యాణ్ ఆరోగ్యం గురించి వివరాలు తెలుసుకున్న మోదీ, ఆయన ధైర్యసాహసాలను ప్రశంసిస్తూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పూర్తి ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలోకి రావాలని ఆకాంక్షించారు.

ఈ విషయాన్ని ప్రధాని మోదీ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. "ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో మాట్లాడి ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నాను. ఆయన ఎంతో ధైర్యవంతుడు. త్వరలోనే పూర్తిగా కోలుకుంటారని నమ్ముతున్నాను. ఆయన సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రార్థిస్తున్నాను" అని పేర్కొన్నారు.

ఇటీవల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పవన్ కల్యాణ్‌కు వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించగా, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని సమాచారం. వైద్యులు వారం నుంచి పది రోజుల విశ్రాంతి సూచించినట్లు తెలిసింది.

ప్రధాని మోదీ పరామర్శ వీరిద్దరి మధ్య ఉన్న సన్నిహిత సంబంధానికి నిదర్శనంగా నిలిచిందని జనసేన శ్రేణులు పేర్కొంటున్నాయి. అభిమానులు, పార్టీ నాయకులు పవన్ కల్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు.

# తమిళనాడులో ఎన్నికల ప్రచారానికి సీఎం చంద్రబాబు



- కోయంబత్తూరు, హోసూరు, తళ్లి, అవడి, మధురైలలో 20, 21 తేదీల్లో సీఎం ఎన్నికల ప్రచారం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమిళనాడు వెళ్లనున్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో తమిళనాడులోని కోయంబత్తూరు, హోసూరు, తళ్లి, ఆవడి, మధురైలలో ఎన్డీఏ పక్షాల అభ్యర్థుల తరపున సీఎం ప్రచారం నిర్వహించనున్నారు. రేపు ఉదయం అమరావతి నుంచి కోయంబత్తూరు బయల్దేరి వెళ్లనున్న ముఖ్యమంత్రి... మధ్యాహ్నం 1 గంటకు కోయంబత్తూరులో నిర్వహించే ఎన్నికల ప్రచార సభలో పాల్గొంటారు. అనంతరం హోసూరు నుంచి తళ్లి చేరుకుని సాయంత్రం 4.45 గంటలకు ప్రచార ర్యాలీకి హాజరవుతారు. రాత్రికి చెన్నై చేరుకుని ఆవడిలో జరుగనున్న రోడ్ షోలో పాల్గొని ఎన్డీఏ అభ్యర్థుల తరపున ప్రచారం చేయనున్నారు. రేపు రాత్రికి అక్కడే బస చేయనున్న సీఎం చంద్రబాబు... 21వ తేదీ ఉదయం చెన్నై నుంచి బయల్దేరి మధురై చేరుకోనున్నారు. మధురై సమీపంలోని సాత్తూర్ లో మధ్యాహ్నం 1 గంటకు వివిధ సామాజిక వర్గాల నేతలతో సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం 3 గంటలకు సాత్తూర్ లోనే ఎన్డీఏ అభ్యర్థి తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. సాయంత్రం 5.15 గంటలకు మధురై నుంచి హైదరాబాద్ కు వెళ్తారు.

# కేంద్రానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ కృతజ్ఞతలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాజమండ్రి సమీపంలోని నిడదవోలు నుంచి విశాఖపట్నం సమీపంలోని దువ్వాడ వరకు కొత్తగా రెండు రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంపై ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్య సాధన దిశగా మరో కీలక ముందడుగని అభివర్ణించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం సహకారం అందిస్తోందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు అమలుతో ప్రయాణికుల రద్దీ తగ్గడంతో పాటు ప్రయాణ సమయం ఆదా అవుతుందని తెలిపారు. అన్నవరం, ద్రాక్షారామం, అంతర్వేది వంటి ఆధ్యాత్మిక క్షేత్రాలకు వెళ్లే భక్తులకు మరింత సౌకర్యం కలుగుతుందని అన్నారు. సరకు రవాణా మరింత వేగవంతమవడంతో పారిశ్రామిక అభివృద్ధికి ఊతం లభిస్తుందని, రాష్ట్ర ఆర్థిక ప్రగతికి ఇది ఎంతో దోహదపడుతుందని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల విస్తరణకు కేంద్రం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని, ఈ రైల్వే ప్రాజెక్టు ద్వారా తూర్పుగోదావరి నుంచి విశాఖ వరకు అభివృద్ధి మరింత వేగం పుంజుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఎస్ఆర్ఎంలో ఎమర్జింగ్ స్కాలర్స్ కాన్ఫరెన్స్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శుక్రవారం ప్రారంభమైన 'ఎమర్జింగ్ స్కాలర్స్ కాన్ఫరెన్స్ – 2026 'శనివారం సాయంత్రం విజయవంతంగా ముగిసింది. ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూ ఎకనామిక్ థింకింగ్ భాగస్వామ్యంతో యూనివర్సిటీలోని ఎకనామిక్స్ విభాగం ఈ సదస్సును ఏర్పాటు చేసింది. గ్లోబలైజేషన్ ను వివిధ కోణాల్లో అధ్యయనం చేసేందుకు ఈ సదస్సు ముఖ్య వేదికగా నిలిచింది. కొత్త ప్రపంచానికి సరికొత్త ఆలోచనలు అన్న థీమ్ తో సదస్సును నిర్వహించడం విశేషం. మద్రాసు స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ డైరెక్టర్ ఆచార్య ఎన్ ఆర్ భానుమూర్తి విశిష్ట అతిథిగా సదస్సుకు హాజరై జెండర్ బడ్జెటింగ్ – సమగ్ర వృద్ధి అన్న అంశంపై ప్రసంగించారు. ఎడ్యుకేషనల్ హబ్స్ ఆన్ ఎర్లీ డెవలప్ మెంట్ పాలసీ అన్న అంశంపై జరిగిన ప్యానల్ డిస్కషన్ లో ప్రొఫెసర్ ధనమంజిరి సాథే, ప్రొఫెసర్ పరిచిత్ ఘోష్, ప్రొఫెసర్ పుష్ప త్రివేది, ప్రొఫెసర్ రాహుల్ సిరోహి మరియు డాక్టర్ షహాజాది తదితరులు పాల్గొన్నారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య సతీష్ కుమార్ హాజరైన ప్రముఖులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సదస్సులో ఎకనామిక్స్ విభాగం అధిపతి డాక్టర్ మనీష్ కుమార్, ఈశ్వరి స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ డాక్టర్ విష్ణు తదితరులు పాల్గొన్నారు

# స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుకు ప్రాధాన్యత కల్పించిన కూటమి ప్రభుత్వం

- 20లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్





**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** గ్రామీణ యువత మహిళలు దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలపై, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో తగుప్రాధాన్యం కల్పించడం జరుగుతోందని, 20లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యమని కేంద్రసహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని బుర్రిపాలెం గ్రామం బిఇడి కళాశాలలో, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో,గత 3నెలలుగా, కేంద్రప్రభుత్వ పథకమైనా దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన పథకం ద్వారా నైపుణ్యాభివృద్ధి,శిక్షణ పొందిన 105మంది యువతులకు,ఆదివారం నర్సింగ్ అసిస్టెంట్ ఉద్యోగ ఆఫర్ లెటర్ల పంపిణీ కార్యక్రమంలో, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు పాల్గొని, సర్టిఫికేట్లు అందజేశారు. ఈసందర్భంగా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతు స్కిల్ డెవలప్ మెంట్ కోర్సుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల, భాగస్వామ్యంతో,ఒకొక్కరికి 75వేలు ఖర్చు చేస్తుందన్నారు. గ్రామీణ, యువత, మహిళలు స్కిల్ డెవలప్ మెంట్ కోర్స్ సద్వినియోగం చేసుకుని, ఉద్యోగ అవకాశాలు ఉపయోగించుకోవాలన్నారు. గతంలో ఈఅవకాశం సక్రమంగా ఉపయోగంలోకి రాలేదన్నారు. కూటమి ప్రభుత్వం 20లక్షల ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో పనిచేస్తుందన్నారు. ఈక్రమంలో, ఈసంవత్సరం లక్ష ఉద్యోగాలకు ప్లాన్ చేస్తున్నమన్నారు. శిక్షణ పొందిన వారికి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతు స్కిల్ డెవలప్ మెంట్ కోర్స్ ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనకు, కేంద్రమంత్రి వర్యులు కీలక పాత్ర పోషిస్తున్నారని,

శిక్షణ పూర్తి చేసుకుని సర్టిఫికెట్స్ పొందేవారిని చూస్తుంటే, వారిలో ఓసంతృప్తిని చూస్తున్నామని అన్నారు. జీవితంలో ఎప్పుడు ఎత్తు పల్లాలు ఉంటాయని, వాటిని అధిగమించి నిలబడటమే జీవితం అన్నారు. లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దేశంలో దిశ, దశ లేకుండా జీవించే వాళ్ళకు, ఈ విధానం ఎంతో ప్రయోజన కరమన్నారు. యువత ఆలోచనలకు, నైపుణ్యం జోడించి, జీవితాలు సార్థకం చేసుకోవాలన్నారు. యువత కోసం, మహిళల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూపుతున్న చొరవ,స్వచ్ఛంద సంస్థల తోడ్పాటుకు ధన్యవాదాలు తెలిపారు.

పేదలకోసం పనిచేయాలనే తపనతో ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని అన్నారు. అనంతరం అతిధుల చేతులమీదుగా సర్టిఫికేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇంచార్జ్ సబ్ కలెక్టర్ లక్ష్మికుమారి,నారాయణస్వామి, డిఆర్డీఏ పిడి. విజయలక్ష్మి, సీడ్ ఎపి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్,సునీల్ కుమార్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అన్న క్యాంటీన్లకు నారా భువనేశ్వరి రూ.76 లక్షల విరాళం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో అన్న క్యాంటీన్లు అన్నం పెట్టే అమ్మను తలపిస్తున్నాయని నారా భువనేశ్వరి అన్నారు. అన్న క్యాంటీన్ల సేవలు ఎంతో మన్నన పొందాయని...లక్షల మంది పేదల కడుపు నింపే మహోన్నత కార్యక్రమంగా కూటమి ప్రభుత్వం దీన్ని నిర్వహించడం గొప్ప విషయం అని భువనేశ్వరి అభిప్రాయ పడ్డారు. రూ. 5లకే పరిశుభ్ర వాతావరణంలో ప్రభుత్వం గౌరవంగా పేదలకు భోజనం అందిస్తోందని ఆమె అన్నారు. ఏప్రిల్ 20వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా నారా భువనేశ్వరి రూ. 76 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు సీఎం క్యాంప్ కార్యాలయంలో చెక్ ను అన్న క్యాంటీన్ సీఈవోకు అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదినం అయిన ఏప్రిల్ 20న రాష్ట్ర వ్యాప్తంగా 269 అన్న క్యాంటీన్లలో పూర్తి ఉచితంగా భోజనం అందించాలని భువనేశ్వరి కోరారు. చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా పేదలకు కడపు నింపే అన్న క్యాంటీన్లకు విరాళం ఇవ్వడం ఎంతో సంతృప్తిని ఇచ్చిందని భువనేశ్వరి అన్నారు. అత్యంత పరిశుభ్రమైన వాతారణంలో అన్న క్యాంటీన్లలో పౌష్టికాహారం అందించడం గొప్ప విషయం అని ఆమె అభిప్రాయ పడ్డారు. రోజువారీ కూలీలు, పేదలు ఈ పథకం ద్వారా ఎంతో లబ్ది పొందుతున్నారని...ఇలాంటి కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు. ఏ ఒక్కరూ ఆకలితో ఉండకూడదనే లక్ష్యంతో అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని భువనేశ్వరి అన్నారు. అన్న క్యాంటీన్లకు ఆర్థికంగా చేయూతనిచ్చి స్ఫూర్తి నింపేందుకు అంతా ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం కంటే సంతృప్తి ఏముంటుదని వ్యాఖ్యానించిన భువనేశ్వరి....తాను పలు సందర్భాల్లో అన్న వితరణ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు కలిగిన సంతృప్తిని, ప్రజల స్పందనను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. తమ మనవడు దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా 12 ఏళ్లుగా ప్రతీ ఏటా తిరుమలలో అన్న ప్రసాదానికి రూ. 44 లక్షలు విరాళంగా ఇస్తున్న విషయాన్ని ఆమె ప్రస్థావించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నారా భువనేశ్వరి.... అన్న క్యాంటీన్లకు రూ. 76 లక్షల విరాళం ఈ ఏడాది మీ పుట్టిన రోజుకు మేమిచ్చే బహుమానం అంటూ వ్యాఖ్యానించారు. తన పేరు మీద అన్న క్యాంటీన్లకు ఒక రోజు అన్నదానానికి రూ. 76 లక్షల విరాళం ఇచ్చిన తన సతీమణి భువనేశ్వరిని ముఖ్యమంత్రి అభినందించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ... "రాష్ట్రంలో అన్నదాన కార్యక్రమాన్ని ఒక గొప్ప కార్యక్రమంగా ముందుకు తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తున్నాం. తిరుమలలో భక్తుల సహకారంతో 4 దశాబ్దాలుగా అన్నదానం జరుగుతోంది. అలాగే ప్రముఖ దేవాలయాల్లోనూ అన్నదానం నిర్వహిస్తున్నాం. పేదలకు రూ. 5 లకే కడుపునింపే అన్న క్యాంటీన్ సేవలను మరింత విస్తరించాలి. నాణ్యతను పాటించడంతో పాటు..పవిత్రంగా, గౌరవంగా, పరిశుభ్రంగా ఆహారం అందించే ఈ కార్యక్రమానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు ఇవ్వాలి. పుట్టిన రోజు, పెళ్లి రోజు సహా తమకు నచ్చిన రోజు భోజనాలకు అయ్యే ఖర్చును విరాళంగా ఇచ్చేందుకు ప్రజలు ముందుకు రావాలి. ఇదొక స్ఫూర్తి దాయకమైన కార్యక్రమంగా మారి బ్రాండ్ ను సృష్టించాలి' అని చంద్రబాబు అన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా 'అన్నమయ్య' జల సంరక్షణ మోడల్ : సీఎం చంద్రబాబు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో భూగర్భ జలాలను పెంచే దిశగా చేపట్టిన 'జలధార – జలహారతి' కార్యక్రమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి సంరక్షణలో అన్నమయ్య జిల్లా అమలు చేస్తున్న విధానాన్ని ఆదర్శంగా తీసుకుని, రాష్ట్రవ్యాప్తంగా ప్రతిచోటా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ జలధార ప్రాజెక్టుకు అన్నమయ్య జిల్లా కలెక్టర్‌ను నోడల్ అధికారిగా సీఎం నియమించారు. భూగర్భ జలాల పెంపుతో విద్యుత్ భారం తగ్గుతుందని, ఆదా అయిన నిధులను ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించవచ్చని సీఎం వివరించారు. జలధార కింద అన్ని ఆలయాల పుష్కరిణిల్లోకి నీటిని చేర్చాలని, పట్టణ ప్రాంతాల్లో నోడల్ అధికారులు పనులను పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. నీటి సంరక్షణ కోసం చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో ప్రజలను కూడా భాగస్వాములను చేయాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

# ఘనంగా నాన్‌గ్రాడ్యుయేట్ వెటర్నరీస్ ఫెడరేషన్ స్వర్ణోత్సవ వేడుకలు



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ నాన్‌గ్రాడ్యుయేట్ వెటర్నరీస్ ఫెడరేషన్ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలు, రాష్ట్ర సర్వసభ్య సమావేశం, ప్రపంచ పశువైద్య దినోత్సవ వేడుకలు ఆదివారం గుంటూరులో ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఏపీ ఎన్‌జీవో సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి సుమారు 600 మంది సభ్యులు హాజరయ్యారు.

ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ వి. సేవా నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బి. గోవిందరాజు, కో–చైర్మన్ ఎన్. రాఘవరావు, వైస్ చైర్మన్లు జి. రామకృష్ణ, ప్రసాదరావు, సీహెచ్. అనిల్, రాకేష్, శశిధర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మాజీ చైర్మన్లు ఎస్. వెంకటేశ్వర్లు, సంజీవరెడ్డి, రామారావు, ఆర్. డి. సుబ్రహ్మణ్యం, వెంకటరాముడు హాజరై సంఘం అభివృద్ధి, ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై మాట్లాడారు. గుంటూరు జిల్లా ఏపీఎన్‌జీవో అసోసియేషన్ అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, కార్యదర్శి శ్యాంసుందర్ శ్రీనివాసరావు, రాష్ట్ర ఏపీఎన్‌జీవో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నాగూర్ షరీఫ్, జిల్లా సంయుక్త సంచాలకులు కేవీపీ సత్యనారాయణ పాల్గొని ఉద్యోగుల సంక్షేమంపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా పారా వెటర్నరీ కౌన్సిల్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, సీనియర్ కేడర్ వీఎల్‌వోలకు గెజిటెడ్ హోదా కల్పించాలని, ఎల్ఎస్ఏ క్యాడర్‌ను వెటర్నరీ ఇన్‌స్పెక్టర్‌గా పేరు మార్పు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అనంతరం సభ్యుల ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలు ఉత్సాహంగా సాగాయి. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన సభ్యులు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రిజిస్టర్ ఉపాధ్యాయ సంఘాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలి: ఫోర్టో

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** విద్యారంగ సమస్యల పరిష్కారానికి రిజిస్టర్ ఉపాధ్యాయ సంఘాలతో విద్యాశాఖ ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్ ఆర్గనైజేషన్స్ (ఫోర్టో) ప్రభుత్వాన్ని కోరింది.

ఫోర్టో రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం అంతర్జాలం ద్వారా నిర్వహించబడింది. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ విద్యా వ్యవస్థలోని అసమానతలను తొలగించేందుకు అన్ని విద్యా వ్యవస్థలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. 2026–27 విద్యా సంవత్సరాన్ని సమస్యలేని విద్యా సంవత్సరంగా రూపొందించేందుకు సమగ్ర రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని సూచించారు.

"మనబడి -- మన భవిష్యత్తు" కార్యక్రమానికి సంబంధించిన పనులను కాంట్రాక్టర్లకు అప్పగించాలని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేసి బోధనేతర పనుల నుంచి మినహాయిస్తే నాణ్యమైన బోధన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. బోధనా సమయాన్ని వారానికి గరిష్టంగా 30 పీరియడ్స్‌కే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు.

ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ఒక తెలుగు పోస్టును కేటాయించాలని, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల నిష్పత్తి 1:40గా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. హేతుబద్ధీకరణను రెండు సంవత్సరాలకు ఒకసారి మాత్రమే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

ఖాళీగా ఉన్న పీఎస్ హెచ్ఎం పోస్టులను ఎస్జీటీలకు పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని, మున్సిపల్ పరిధిలో స్పెషల్ టీచర్‌గా రూ. 398 వేతనంతో పనిచేసిన ఉపాధ్యాయులకు జిల్లా పరిషత్ ప్రభుత్వ యాజమాన్య ఉపాధ్యాయులతో సమానంగా నోషనల్ ఇన్‌క్రిమెంట్లు మంజూరు చేయాలని కోరారు.

రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్పొరేషన్లలో ఖాళీగా ఉన్న 13 ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టులను సీనియర్ హెచ్ఎంలకు పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని, యూఎల్‌బీలకు అర్బన్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టులను సృష్టించాలని సూచించారు.

2004కు ముందు నియామకం పొందిన మున్సిపల్ ఉపాధ్యాయులందరికీ జీపీఎఫ్ ఖాతాలను తక్షణమే ప్రారంభించేందుకు విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

ఎ.పి. మోడల్ స్కూల్స్‌లో జీవో నెం. 23కు సంబంధించిన సవరణ ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలని, 010 పద్దు కిందనే జీతాలు కొనసాగిస్తూ స్పష్టమైన సర్వీస్ రూల్స్ రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

గత వేసవిలో బదిలీల్లో బదిలీ అయినప్పటికీ రిలీవర్ లేక అదే పాఠశాలలో కొనసాగుతున్న ఉపాధ్యాయులను తక్షణమే రిలీవ్ చేయాలని, ప్లస్ టూ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పీజీటీ పోస్టులను భర్తీ చేయాలని, సీబీఎస్ఈ పాఠశాలలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

డీఎస్సీ నియామకాలు పూర్తయ్యేంతవరకు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని కోరారు.

ఈ సమావేశంలో చైర్మన్ కరణం హరికృష్ణ, సెక్రటరీ జనరల్ అంకాల కొండయ్యతో పాటు టి. వెంకటరెడ్డి, విజయలక్ష్మి, బృందబాన్ డొలై, బలివాడ ధనుంజయ్ రావు, గాండ్లపర్తి శివానందరెడ్డి, చాట్రాగడ్డ సుధాకర్, శివశంకర్ రెడ్డి, మాగంటి శ్రీనివాసరావు, ఎస్టిఎఫ్ రామాంజనేయులు, పాలెల రామాంజనేయులు, గరికపాటి సురేష్, చల్లగుండ్ల శ్రీనివాసరావు, పెద్దన్న, శివార్జున, నూకరాజు, దొడ్డ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భగవాన్ పరశురామ జయంతి వేడుకలు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** విష్ణువు ఆరవ అవతారంగా భావించే భగవాన్ పరశురాముని జయంతి వేడుకలు ఆదివారం అశోక్‌నగర్‌లోని ఏబీఎఫ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి వి. పాండురంగ విఠల్ మాట్లాడుతూ పరశురాముడు ధర్మ పరిరక్షణకు ప్రతీకగా నిలిచారని అన్నారు. సమాజంలో అన్యాయం, అధర్మం పెరిగినప్పుడు దానిని ఎదుర్కొనే ధైర్యసాహసాలకు పరశురాముడు నిదర్శనమని పేర్కొన్నారు.

హిందూ సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం, సాంప్రదాయ విలువల పరిరక్షణ అవసరమని ఆయన అన్నారు. సమాజంలో విభేదాలు సృష్టించే వ్యాఖ్యలు కాకుండా పరస్పర సామరస్యంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రతి వర్గం పరస్పర గౌరవ భావనతో జీవించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

బ్రాహ్మణ సమాజంపై అనవసర విమర్శలు చేయకుండా, సమాజ సమగ్రతకు తోడ్పడే విధంగా అందరూ వ్యవహరించాలని కోరారు. హిందూ ధర్మం, సంస్కృతి పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ, ఏఐబీఎఫ్ జాతీయ కార్యదర్శి తిప్పావజ్జుల ధ్రువ నారాయణ శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గణపవరపు రంగారావు, జిల్లా అధ్యక్షుడు శంకరమంచి లలిత శాస్త్రి, ఏపీబీఎస్ఎస్ఎస్ రాష్ట్ర కన్వీనర్ కొప్పర్తి సీతారమేష్, మాటేటి నాగరాజు, జూపూడి ప్రవీణ్, గొల్లపూడి గిరిభూషణ్ రావు, గుంటుపల్లి అనంత్ శర్మ తదితరులు పాల్గొన్నారు.




# దేవాలయాల స్వయంప్రతిపత్తి కోసం వీహెచ్పీ జాతీయ ఉద్యమం



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తం చేసి స్వయంప్రతిపత్తి కల్పించాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం లక్ష్మీపురంలోని శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘంలో 'దేవాలయాల స్వయంప్రతిపత్తి అవగాహన సదస్సు' నిర్వహించారు.

జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చెట్టి నిరంజన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ప్రత్తిపాటి మాధవశర్మ పాల్గొన్నారు. స్వామీజీలు నిర్వికల్పానంద గిరి, యోగి శ్రీనివాస ప్రభు మాట్లాడుతూ ఆలయాలను పూర్తిగా హిందువులే నిర్వహించుకునేలా మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

ముఖ్య వక్తగా పాల్గొన్న విశ్వహిందూ పరిషత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంఘటన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడిచినా హిందువులకు తమ దేవాలయాలను తాము నిర్వహించుకునే స్వేచ్ఛ ఇంకా రాలేదన్నారు. ప్రభుత్వాలు హిందూ దేవాలయాల నిర్వహణలో జోక్యం చేసుకోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 12, 25, 26కు విరుద్ధమని పేర్కొన్నారు.

ప్రభుత్వాల పాలనలో దేవాలయాల ఆదాయాలు దుర్వినియోగం అవుతున్నాయని, ఆలయ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రస్ట్‌బోర్డులు, ఉద్యోగ నియామకాలలో అన్యమతస్థులు, నాస్తికులకు అవకాశం కల్పించడం వల్ల ఆలయ పవిత్రత దెబ్బతింటోందని విమర్శించారు.

దేవాలయాలను రాజకీయ పునరావాస కేంద్రాలుగా ఉపయోగిస్తున్నారని, దేవాలయ భూములను ప్రభుత్వ భూములుగా భావించే ధోరణి పెరుగుతోందని అన్నారు. ఈ పరిస్థితులను మార్చేందుకు విశ్వహిందూ పరిషత్ జాతీయ స్థాయిలో ఉద్యమాన్ని ప్రారంభించిందన్నారు.

దేవదాయ ధర్మదాయ చట్టం స్థానంలో కొత్త నమూనా ముసాయిదా చట్టాన్ని రూపొందించామని, దాని పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో 2025 జనవరి 5న విజయవాడలో హైందవ శంఖారావం పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించినట్లు గుర్తు చేశారు.

ప్రాంత కోశాధికారి వనవర్తి దుర్గ ప్రసాదరాజు నూతన ముసాయిదా చట్టంలోని అంశాలను వివరించారు. వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు, భక్తులు, ప్రజలు పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు. కార్యక్రమం ముగింపులో ముసాయిదా కరదీపికలను అందరికీ పంపిణీ చేశారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467